
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు

5

మంగళవారం 8 జులై 2025

మదనపల్లె డివిజన్‌కు
పూర్వవైభవం


మదనపల్లె వ్యూ

- త్వరలో కలవనున్న పుంగనూరు
- విస్తరించనున్న రెవెన్యూ, పోలీసు పాలన
- విద్య, వైద్యసేవలు సులభం

మదనపల్లె టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్ పూర్వ వైభవం సంతరించుకోనుంది. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని పుంగనూరు నియోజకవర్గాన్ని త్వరలో అన్నమయ్య జిల్లాలో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని నెలన్నర క్రితం కలెక్టర్ చామకూరి శ్రీధర్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరో వారం రోజుల్లోనే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాలో (మదనపల్లె డివిజన్‌లో) విలీనం చేసేందుకు అధికారగణం ప్రభుత్వానికి నివేదికలు పంపనుంది. ఇదే జరిగితే మదపల్లె డివిజన్‌కు పూర్వవైభవం రానుంది.

అతి పెద్ద రెవెన్యూ డివిజన్

స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి మదనపల్లె డివిజన్ దేశంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా పేరొందింది. 31 మండలాలు, 501 గ్రామ పంచాయతీలతో, 21 పోలీసు స్టేషన్‌లు గల సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంతో మణిమకుటంగా ఉండేది. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో గతంలో కుప్పం, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాలు కూడా ఉండేవి. దీంతో అతి పెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఉండేది. ఈ క్రమంలో రెండున్నరేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో జిల్లాలను పునర్విభజన చేయడంతో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల్లో ఆరు నియోజకవర్గాలను కలిపి అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేసింది. కానీ ఇదే ఎంపీ నియోజకవర్గంలోని పుంగనూరును మాత్రం వైసీపీ పెద్దలు చిత్తూరు జిల్లాలో కలిపేశారు. మదనపల్లెకు 20 కిలోమీటర్ల దూరంలోని పుంగనూరు నియోజకవర్గ కేంద్రం, చౌడేపల్లె, సోమల మండలాలను చిత్తూరులో కలపడంతో అక్కడి ప్రజలు ప్రభుత్వ సేవల కోసం దూరాన ఉన్న చిత్తూరు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబునాయుడు క్యాబినెట్ సమావేశంలో పుంగనూరు నియోజకవర్గాన్ని రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అన్నమయ్య జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రభుత్వం 40 రోజుల క్రితం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పుంగనూరు నియోజకవర్గాన్ని మదనపల్లె డివిజన్‌లో కలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే నెల రోజుల్లో తెలపాలన్నది గెజిట్ నోటిఫికేషన్ సారాంశం. కాగా పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలానికి చెందిన పలువురు ఈ ప్రతిపాదనకు అభ్యంతరం తెలుపుతూ చిత్తూరు కలెక్టర్‌కు లేఖలు రాశారు. పుంగనూరు మండలం నుంచి ఒక అభ్యంతరం మాత్రమే వెళ్లింది. దీనిపై చిత్తూరు కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికలు పంపారు.


మదనపల్లె సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయం


మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం

17 మండలాల రెవెన్యూ... 15 మండలాలతో పోలీసు పాలన

మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ప్రస్తుతం 11 మండలాలు ఉన్నాయి. మదనపల్లెలోని మూడు మండలాలు, తంబళ్లపల్లెలోని ఆరు మండలాలు, పీలేరులోని వాల్మీకిపురం, కలికిరి మండలాల రెవెన్యూ పాలన మదనపల్లె సబ్‌కలెక్టర్ చూస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గాన్ని మదనపల్లె డివిజన్‌లో కలిపితే 17 మండలాల రెవెన్యూ పాలన ఇక్కడి నుంచే జరగనుంది. అదేవిధంగా మదనపల్లె సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయం పరిధిలోకి పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, సోమల, చౌడేపల్లె, సదుం, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను చేర్చనున్నారు. రొంపిచెర్ల మండలాన్ని మదనపల్లె ఎస్‌డీపీవో పరిధిలోకి చేర్చితే పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, కలికిరి, పీలేరు పోలీసుస్టేషన్‌లను కూడా మదనపల్లె పోలీసు సబ్ డివిజన్‌లోకి చేర్చేందుకు ప్రతిపాదనలు లేకపోలేదు. ఇదే జరిగితే మదనపల్లె పోలీసు సబ్ డివిజన్ కూడా పూర్వవైభవం సంతరించుకోనుంది.

అడ్మినిస్ట్రేషన్ కేంద్రంగా మదనపల్లె

మదనపల్లె డివిజన్‌లో ప్రస్తుతం మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలోని 11 మండలాల రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ జరుగుతోంది. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని 9 మండలాలతో పోలీసు అడ్మినిస్ట్రేషన్ సాగుతోంది. కానీ మదనపల్లె విద్యా డివిజన్ మాత్రం 12 మండలాలతో కొనసాగుతోంది. అంతేకాకుండా ఏపీ బేవరేజస్ లిమిటెడ్ డిపో నుంచి అటు మదనపల్లె డివిజన్, ఇటు పుంగనూరు, పలమనేరు వరకు మద్యం సరఫరా చేస్తున్నారు. వీటికి తోడు వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ కూడా 12 మండలాల నుంచి జరుగుతోంది. ఈ క్రమంలో మదనపల్లె డివిజన్‌లో పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను కలిపితే తిరిగి అడ్మినిస్టేషన్ కేంద్రంగా మదనపల్లె విరాజిల్లనుంది.

విద్య, వైద్య సేవలు సులువు

మదనపల్లె డివిజన్‌లోకి పుంగనూరు నియోజవర్గాన్ని కలిపితే అక్కడి ప్రజలకు విద్య, వైద్య సేవలు సులువుగా అందనున్నాయి. మదనపల్లె విద్యా డివిజన్‌లో గతంలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలుండేవి. జిల్లా విభజనతో పుంగనూరు దూరమైంది. ఏ పని కావాలన్నా విద్యాశాఖాధికారులు పలమనేరు, చిత్తూరు వెళ్లాల్సి వస్తోంది. అదేవిధంగా మదనపల్లెలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని నాలుగు నెలల క్రితం కుప్పం తరలించారు. దీంతో పాటు పుంగనూరు మండలాల్లోని వైద్య ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) పాలన కుప్పం డిప్యూటీ డీఎంహెచ్‌వో పరిధిలోకి వస్తాయి. ఇక్కడి నుంచి కుప్పం వెళ్లి రావాలంటే నాలుగు గంటల ప్రయాణం చేయాల్సి వస్తోంది. అదే పుంగనూరును మదనపల్లె డివిజన్‌లో చేరిస్తే వైద్య ఆరోగ్య శాఖ పాలన సజావుగా, సులువుగా సాగనుంది.

ప్రజల సమస్యలకు ప్రథమ ప్రాధాన్యం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రజా విజ్ఞప్తులను నిశితంగా పరిశీలించి వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఇతరుల పేర్లు నమోదై ఉన్నాయని, వారి పేర్లను తొలగించాలని కోరుతూ కలెక్టర్‌కు రాయచోటి మండలం ఎగువ అబ్బవరం వార్డు నెంబర్-15, రాయుడుకాలనీలోని నగిరి మడుగు మహేశ్ వినతిపత్రం ఇచ్చాడు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పనులు చేశామని, వాటికి సంబంధించిన బిల్లులు అన్నీ చెల్లించారని, డిపాజిట్ డబ్బు మాత్రం ఇంతవరకు పడలేదని మంజూరు చేయాలని రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలోని సూర్యనారాయణపురం (మేదరపల్లి)కు చెందిన ఆర్ల సుబ్బయ్య కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా నిమ్మ చెట్లను మంజూరు చేయాలని పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామ పంచాయతీ బెస్తపల్లికి చెందిన ఎల్.నారాయణరెడ్డి కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి వారం ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేయండి

● సబ్ కలెక్టర్‌ను ఆదేశించిన కలెక్టర్

మదనపల్లె టౌన్, జూలై 7 (అంధ్రజ్యోతి): మదనపల్లె ప్రభుత్వాస్పత్రి నిర్వహణ, వైద్యుల విధులపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ప్రతి వారం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి తనిఖీ చేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్‌కలెక్టర్‌కు కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. పీటీఎం మండల సర్వేయర్, మడుమూరు విలేజ్ సర్వేయర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే గ్రామానికి చెందిన రైతు వెంకటప్పకు చెందిన 2.52 ఎకరాల భూమి రీసర్వే తరువాత 94 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపిస్తుండగా, మిగిలిన భూమి 18 మంది పేర్లతో రికార్డులకు ఎక్కింది. ఈ విషయమై బాధితుడు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, దీనిపై వీడియో కాన్ఫరెన్స్‌లో పీటీఎం సర్వేయర్ వాణి, విలేజ్ సర్వేయర్ సురేష్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. రైతుకు అన్యాయం జరగకుండా చూడాలని వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని, లేకుంటే సస్పెండ్ ఎందుకు చేయకూడదని కలెక్టర్ ప్రశ్నించారు.

సింహవాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు సోమవారం సింహవాహనంపై సౌమ్యనాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి మృగరాజు అయిన సింహవాహనంపై మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో సింహవాహనంపై సౌమ్యనాథుడు

బ్రహ్మోత్సవాల్లో నేడు: ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పల్లకి సేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

పేదలకు కూటమి ప్రభుత్వమే అండ

● రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు


గ్రామస్తులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు కూటమి ప్రభుత్వమే అండ అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సోమవారం వీరబల్లి మండలం సానిపాయిలో సుపరిపాలన తొలి తొడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. చిరు వ్యాపారులతో మాటామంతి కలిపారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు ఆయనతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వమే బాగుందని, గత ప్రభుత్వంలో ఒక్క బిడ్డకే అమ్మఒడి వచ్చేదని, ఈ ప్రభుత్వంలో తల్లికి వందనం ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ వచ్చిందని, రాబోయే కాలంలో కూడా కూటమి ప్రభుత్వమే ఉండాలని చిరువ్యాపారులు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ మంచి అన్నది పేదలకు చేరితే ఏ ప్రభుత్వమైనా విజయం సాధించినట్టేనని, ఎవరు ఏమనుకున్నా పేదలకు మంచి చేసే ప్రభుత్వం మాత్రం కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, కమ్మ సంఘం అధ్యక్షుడు శివనారాయణ చౌదరి, మేక నరసింహానాయుడు, మాజీ సర్పంచ్ రమణ, టీడీపీ నాయకులు జయరాంయాదవ్, లక్ష్మణ్‌రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివకుమార్‌నాయుడు, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం


పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను పెద్దఎత్తున దర్శించుకున్నారు.

10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రాయచోటి (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 10వ తేదీ మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మెగా పీటీఎంపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, డీఈవో, డీఐఈవో, ఎంఈవోలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో దాదాపు రెండు లక్షల 50 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అందరూ కలిపి దాదాపు 6,75,000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో పోలీసుశాఖ వారు సేనో టు డ్రగ్స్, సైబర్ క్రైమ్స్, ఆడపిల్లలు, మహిళలను వేధింపులకు గురిచేసే పరిణామాలు, తదితర అంశాలపై పాటించాల్సిన మెలకువల గురించి ఎస్‌హెచ్‌వోలు అవగాహన కల్పిస్తారన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్య రాకుండా సిబ్బందిని కేటాయించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాజకీయం కోసమే జగన్ పర్యటన

- మామిడి రైతుల పేరుతో దొంగ పరామర్శ
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ లబ్ధి కోసమే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో తోతాపురి మామిడి రైతుల పరామర్శ పెట్టారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మామిడి రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. గత ఏడాది తోతాపురి మామిడి ఉత్పత్తి 2.5 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాగా ఈ ఏడాది ఏకంగా 6.5 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. దిగుబడి ఎక్కువగా ఉండడం వల్ల రైతులకు ధర విషయంలో ఇబ్బంది కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కిలోకు రూ. 4 చొప్పున ప్రభుత్వం ఇస్తోందని, రూ.8కి తగ్గకుండా పల్ప్ ఫ్యాక్టరీల వారు, ట్రేడర్లు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. మామిడి రైతులకు కనీసం కిలోకు రూ.12 వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా మద్దతు ధర ప్రకటించడమే కాకుండా కేంద్రం నుంచి సాయం కోసం లేఖలు రాసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో 3,08,261 మెట్రిక్ టన్నుల మేర మామిడిని ట్రేడర్లు, పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ర్యాంపులు, మండీల ద్వారా మరో 81 వేల మెట్రిక్ టన్నుల మామిడి ఇతర రాష్ట్రాలకు విక్రయం జరిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 50,922 మంది రైతుల నుంచి మామిడి కొనుగోళ్లు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు ఏపీలోని మామిడి రైతులు ఇబ్బంది పడకుండా కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాల నుంచి వచ్చే తోతాపురి మామిడిని రాష్ట్రంలోకి రానివ్వకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతుల విషయమే కాకుండా పల్ప్ పరిశ్రమల యాజమాన్యాల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని మ్యాంగోపల్ప్‌పై ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసినట్లు వివరించారు.

జగన్ పరామర్శ రాజకీయాలు

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంటే జగన్ రాజకీయాలు చేస్తున్నాడని, రైతుల పేరుతో ప్రభుత్వంపై రాళ్లేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. చిత్తూరు జిల్లాలో రైతులను పరామర్శించడానికే వెళుతున్న జగన్ బలప్రదర్శన తరహాలో వెళ్లడం ఎందుకు? జనసమీకరణ టార్గెట్లు, వాహనాల మోహరింపు ఎందుకో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. తోతాపురి మామిడితో సంబంధం లేని కడప జిల్లా నుంచి కార్యకర్తలను ఎందుకు తరలిస్తున్నారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల నుంచి 25 వేల మంది కార్యకర్తలను తరలించాల్సిన అవసరం ఉందా? దీనికోసం 90 బస్సులు, 1810 కార్లు, వ్యాన్లు, 2230 బైకులతో దండయాత్ర చేస్తారా? అని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కనుసన్నల్లో ఉన్న పల్ప్ ఫ్యాక్టరీలు కొద్ది రోజుల నుంచి మామిడి కొనుగోలు చేయకుండా చేసింది వాస్తవం కాదా? అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులను పట్టించుకోని జగన్ అధికారం పోయాక తన రాజకీయం కోసం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడని విమర్శించారు.

దొంగ నోట్ల ముఠా గుట్టు రట్టు

- 735 నకిలీ కరెన్సీ నోట్లు స్వాధీనం
- 10 మంది నిందితులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


పోలీసులు స్వాధీనం చేసుకున్న దొంగనోట్లు, ప్రింటర్లు, ల్యాప్‌ట్యాప్, సెల్‌ఫోన్లు, పేపర్స్

రాయచోటిటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ నోట్ల ముద్రణతో పాటు చలామణి చేస్తున్న పదిమందిని పోలీసులు అరెస్టు చేశారు. వాల్మీకిపురంలో నకిలీ నోట్లు చలామణి అవుతున్నట్లు ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు నిందితుల వివరాలను విలేకరులకు తెలిపారు. వాల్మీకిపురంలోని లక్ష్మీ బ్రాందీషాపులో గత నెల 26వ తేదీ కాలేషా అనే వ్యక్తి రూ.500 నోటు ఇచ్చి మద్యం కొనేందుకు ప్రయత్నించగా మేనేజర్ నవీన్‌కుమార్ దానిని దొంగనోటుగా గుర్తించి నిలదీయడంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడన్నారు. వెంటనే బ్రాందీషాపు మేనేజర్ వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబుకు ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో నకిలీ కరెన్సీ చలామణిపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా సమాచారంతో మదనపల్లి-బెంగళూరు ప్రధాన రహదారిలోని వాల్మీకిపురం క్రాస్ వద్ద నిందితులను పట్టుకున్నారని తెలిపారు. నిందితులు మదనపల్లిలో దొంగ నోట్లను ముద్రించి చలామణి చేస్తున్నారని, వారి వద్ద నుంచి రూ.500 ముద్రణతో ఉన్న 735 నకిలీ నోట్లు, వాటిని ముద్రించడానికి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. షేక్ కాలేషావల్లి అలియాస్ కాలేషా, వీఎం ముస్తాక్ అహ్మద్ అలియాస్ ముత్తు, ఎస్ఎండీ హఫీజ్ అలియాస్ హఫీజ్, భీమసింగ్ పండిట్ రాథోడ్ అలియాస్ భీమసింగ్ రాథోడ్, కుమారస్వామి అలియాస్ కుమార్, షేక్ షఫీక్ అహ్మద్ అలియాస్ షఫీ, నందివంగళం ఎజాజ్ బాషా అలియాస్ యెజాజ్, వీఎం పూర్హాన్, షేక్ ఆసిఫ్, షేక్ సుహేల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరితో పాటు మరో నిందితుడు బాబు పరారీలో ఉన్నాడని చెప్పారు. నిందితులను అరెస్టు చేయడంలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, వాల్మీకిపురం సీఐ జె.ప్రసాద్‌బాబు, ఎస్ఐలను అభినందించారు. సిబ్బందికి జిల్లా ఎస్పీ నగదు రివార్డులు ఇచ్చి ప్రోత్సహించారు.

తంబళ్లపల్లె - శివపురం రోడ్డుకు మోక్షమెప్పుడో..?

● అటవీ శాఖ అనుమతులు రాక ఆగిన పనులు ● రోడ్డు పూర్తైతే జిల్లా కేంద్రానికి తగ్గనున్న దూరం

తంబళ్లపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె-శివపురం రోడ్డుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని పడమటి మండలాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కడప, రా యచోటి ప్రాంతాల నుంచి తంబళ్లపల్లె మీదుగా బెంగ ళూరుకు వెళ్లేందుకు తంబళ్ల పల్లె-శివపురం రోడ్డు ఏర్పా టు చేయాలని 2017లో అ ప్పటి టీడీపీ ప్రభుత్వం సంక ల్పించింది. పనులు ప్రారంభించి తంబళ్లపల్లె నుంచి సుమారు 3 కిలో మీటర్లు.. పెద్ద మండ్యం మం డలం సిద్దవరం నుంచి సు మారు 2 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశారు. మధ్య లో సుమారు 3 కిలోమీటర్లు అటవీ శాఖ పరిధిలో ఉండటం తో ఆ శాఖ నుంచి అనుమతులు రాక నిలిచిపోయింది. నాటి నుంచి నేటి దాకా ఈ రోడ్డు పనులు ఎ క్కడ వేసిన గొంగళి అక్కడేలాగా ఉండిపోయాయి. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. రోడ్డు, రవాణా శాఖ మంత్రిగా రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు. మంత్రి దృష్టి సారించి రోడ్డు పనలుఉ పూర్తి చేస్తే జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని పడమటి మండలాల ప్రజలు అంటున్నారు.



శివపురం రోడ్డుకు డిమాండ్

రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రం చేయడంతో తంబళ్లపల్లె-శివపురం రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలనే డిమాండ్ పెరిగి పోయింది. ప్రస్తుతం తంబళ్లపల్లెతో పాటు, ములకలచెరువు, బి. కొత్తకోట మండలాల ప్రజ లు, అధికారులు జిల్లా కేం ద్రానికి వెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంది. సాధారణ ప్రజలు బస్సుల్లో వెళ్లాలంటే తం బళ్లపల్లె మండల కేం ద్రం నుంచి ముదివేడు క్రాస్ వరకు వెళ్లి, అక్క డి నుంచి మరో బస్సు లో ఎక్కాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, ఇతర సొంత వాహనాల్లో అయితే మండల కేంద్రం నుంచి కన్నెమడుగు మఠం, అక్కడి నుంచి కోట కొండ, కుక్కరాజు పల్లె లేకుంటే కలిచెర్ల, గుర్రం కొండ మీదుగా వెళ్లాల్సి ఉంది. లేదా పెద్ద మండ్యం, చిన్న మం డ్యం మీదుగా రాయ చోటికి వెళ్లాల్సి ఉంది. ఈ రెండు మార్గాల గుండా తంబళ్లపల్లె నుంచి జిల్లా కేంద్రం సుమారు 65 నుంచి 70 కి.మీ దూరం ఉంటుంది. అదే శివపురం రోడ్డు పనులు పూర్తైతే తంబళ్లపల్లె నుంచి నేరుగా చిన్నమండ్యం మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. ఈ రోడ్డు ఏర్పాటు చేస్తే జిల్లా కేంద్రానికి ఇక్కడి నుంచి దాదాపు 20 కి.మీ పైన దూరం తగ్గే అవకాశం ఉంది.

తంబళ్లపల్లె మరింత అభివృద్ధి

తంబళ్లపల్లె-శివపురం రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే నియోజకవర్గ కేంద్రమైన తంబళ్లపల్లె మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. జిల్లా కేంద్రం నుంచి అతి తక్కువ సమయంలో తంబళ్లపల్లెకు చేరుకుని, అక్కడి నుంచి నేరుగా ములకలచెరువు, బి. కొత్తకోట మీదుగా బెంగళూరుకు చేరుకోవచ్చు. కడప, రాయచోటి, చిన్నమండ్యం, పెద్దమండ్యం తదితర ప్రాంతాల రైతులు సులభంగా బెంగళూరు, చింతామణి మార్కెట్లకు వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలు పెరిగి అన్ని వ్యాపార లావాదేవీలు పెరుగుతాయి. రవాణా సౌకర్యం పెరిగితే ఆ ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

అటవీ శాఖ అనుమతులే అడ్డు

రోడ్డు నిర్మాణంలో భాగంగా పోయే అటవీ భూమిని తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లె వద్ద సర్వే నెంబరు 2024/25లో సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని అటవీ శాఖకు కేటాయించినట్లు అధికారులు చెపుతున్నారు. అయితే, కరోనా లాక్‌డౌన్ , అధికారుల బదిలీ వంటి కారణలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

శివపురం రోడ్డు పూర్తి చేస్తాం

తంబళ్లపల్లె-శివపురం రోడ్డు పూర్తి చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 12 న తంబళ్లపల్లెలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రకటించారు. దీంతో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు మండలాల ప్రజల్లో ఆనందం నెలకొంది.

రోడ్డు నిర్మాణం పూర్తైతే మరింత అభివృద్ధి



తంబళ్లపల్లె-శివపురం రోడ్డును పూర్తి చేస్తే తంబళ్లపల్లె అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి ప్రజలు రాయచోటికి వెళ్లాల న్నా .. కడప, రాయచోటి ప్రాంతాల నుంచి బెంగళూరుకు వెళ్లాలన్న ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా రైతులు పండించిన పంటలు బెంగళూరుకు తరలించుకో వడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.

- బాలకృష్ణ, మండల నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం పూర్తి



తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డి నేతృత్వం లో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధి స్తోంది. తంబళ్లపల్లె- శివపురం రోడ్డు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మంత్రితో మాట్లాడి పూర్తి చేయడానికి కృషి చేస్తామని విజయోత్సవ ర్యాలీలో టీడీపీ ఇంచార్జి ప్రక టించారు. అదేకాకుండా కోసువారిపల్లె రోడ్డు, కాలువపల్లె రోడ్డు పనులు కూడా త్వరలో చేపట్టి ప్రజల రోడ్డు కష్టాలు తీరుస్తామని అన్నారు.

- దేరంగుల చంద్ర, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

● సబ్‌కలెక్టర్ నిధియాదేవి



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ నిధియాదేవి

రాజంపేట, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): ప్రజా పరిష్కార వేదికలో ప్రజలు అందజేస్తున్న అర్జీలను సంబంధిత శాఖ అధికారులు త్వరగా పరిష్కరించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియా దేవి అధికారులను సూచించారు. సోమవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదికలో పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అందులో భాగంగా ఊటుకూరు గ్రామ పొలానికి చెందిన సర్వేనంబరు 552, 1497లో పూర్వీకుల నుంచి తమ పొలాలకు వెళ్లేందుకు రస్తా ఉందన్నారు. కొందరు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. దీనిపై గతంలో రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు సర్వేచేసి హద్దులు ఏర్పరచారని తెలిపారు. 552 సర్వేనంబరులో 10 సెంట్లు స్థలం వంక పొరంబోకు అని తెలిపారు. కావున పొలానికి వెళ్లేందుకు దారి చూపాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించాలి: డీవైఈవో



శెట్టిపల్లె పాఠశాలను తనిఖీ చేస్తున్న డీవై ఈవో లోకేశ్వర్ రెడ్డి

పీలేరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన పీలేరు మండలం రేగళ్లు పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లె ప్రాథమిక పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా విద్య బోధించడం కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, ఉన్నతమైన విలువలు నేర్పించాలని సూచించారు. ఉపాధ్యా యులు విధిగా పని వేళలు పాటించాలని సూచించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులకు ఉచితంగా భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు తదితర విద్యాసామగ్రి ఇస్తున్నామని చెప్పారు. ప్రయివేట్ ప్రకటనలకు మోసపోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మెగా పేరెంట్స్ డేని విజయవంతం చేయాలని సూచించారు. ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, సీఆర్‌పీ మాధవి పాల్గొన్నారు.

మురుగు కాలువ పనులు ప్రారంభం



మురుగు కాలువ పనులు చేస్తున్న కార్మికులు

పీలేరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో మురుగు కాలువ నిర్మాణ పనులుప్రారంభమయ్యాయి. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'తవ్వేశారు ... వదిలేశారు' అన్న కథ నానికి స్పందించిన కాంట్రాక్టర్ యుద్ధ ప్రాతిపదికన సోమవారం పనులు ప్రారంబించారు. సుమారు ఏడు నెలల క్రితం మురుగు కాలువ నిర్మాణం కోసం జేసీబీతో కాలువను తవ్వి వదిలేశారు. దీంతో ఈ ప్రాంత వ్యాపారులు, వాహన చోదకులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఆంధ్రజ్యోతి గుర్తు చేసింది. దీంతో స్పందించిన పీలేరు గ్రామ పంచాయతీ అధికారులు, కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంబించారు. దీంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయండి

● తహసీల్దారుకు వీవోఏ వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘమిత్రలు

వాల్మీకిపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను సైతం పరిగణనలోకి తీసుకోకుండా తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని వాల్మీకిపురం మండలంలోని చింతపర్తికి చెందిన సంఘమిత్ర సుమలత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ పామిలేటిని కలిసి వినతి పత్రం అందజేశారు. చింతపర్తి గ్రామం 6 వీవోఏ (సంఘమిత్ర)గా పనిచేస్తున్న తాను కొన్ని ఇబ్బందుల కారణంగా విధులకు దూరంగా ఉన్నానని, సంఘమిత్రగా కొనసాగేందుకు గతంలో హైకోర్టును ఆశ్రయించగా, గతేడాది సెప్టెంబరు 12న సంఘమిత్రగా కొనసాగించేందుకు ఉత్తర్వులు కూడా ఇచ్చిందన్నారు. అయితే విధుల్లోకి తీసుకుండా సంబంధిత అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

రిటైరయిన ఆరేళ్లకు మధ్యంతర పెన్షన్ మంజూరు

● విచారణ ఎదుర్కొంటున్న ఏడీఏ సోమశేఖర్ రెడ్డి

కలికిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వివిధ ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న ఒక అధికారికి ఉద్యోగం నుంచి రిటైరయిన ఆరేళ్ల తరువాత మధ్యంతర పెన్షన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ శాఖలో కె.సోమశేఖర్ రెడ్డి కడప అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసే కాలంలో కొన్ని అభియోగాలు నమోదయ్యాయి. వీటిపై విచారణ జరుతుండగానే ఆయన 2019 జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. అయితే విచారణ కారణంగా అప్పటి నుంచి ఆయనకు పెన్షన్ మంజూరు కాలేదు. పదవీ విరమణానంతరం అందాల్సిన ప్రయోజనాలేవీ అందలేదు. విచారణలో జాప్యం జరుగుతున్న కారణంగా తనకు కనీసం మధ్యంతర పెన్షన్ మంజూరు చేయాలని గత మార్చి నెలలో ఆయన చేసుకున్న విన్నపాన్ని పరిశీలించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టరు గత జూన్ 18న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. పరిశీలించిన ప్రభుత్వం మధ్యంతర పెన్షను మంజూరుకు సంబంధించిన నియమాల మేరకు మొత్తం పెన్షన్ రూ.28,845లో 75 శాతం మించకుండా చెల్లించాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా నిబంధనల మేరకు రావలసిన పెన్షన్‌లో రూ.21,634లు మంజూరు చేసింది. కమ్యుటేషన్, గ్రాట్యుటీ, తదితర పదవీ విరమణానంతరం చెల్లించాల్సిన ప్రయోజనాలన్నీ విచారణ పూర్తయ్యే వరకూ పెండింగ్‌లో ఉంచాల్సిందిగా తెలియజేస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

హంసవాహనంపై సిద్దేశ్వరుడి విహారం



హంస వాహనంపై విహరిస్తున్న సిద్దేశ్వరస్వామి

రాజంపేట టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామిని, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారిని ప్రత్యేకఅలంకరణలో కొలువు దీర్చారు. హంస వాహనంపై సిద్దేశ్వరస్వామిని, చిన్నశేష వాహనంపై చెన్నకేశవస్వాములను తాళ్లపాక మాడవీధుల్లో ఊరేగించారు. చివరగా చెన్నకేశవస్వామివారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరికి టీటీడీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు



జోష్ణవి (ఫైల్ ఫొటో)

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తమ కూతురు కనిపించడం లేదంటూ పట్టణంలోని బండ్లవంకకు చెందిన సునీత ఫిర్యాదు చేసినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరులోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో జోష్ణవి 8వ తరగతి చదువుతుండగా, ఆమె తల్లి సునీత అదే పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తోంది. ఆదివారం జోష్ణవి జన్మదినం కావడంతో సునీత తన కూతురిని ఇంటికి తీసుకెళ్లింది. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ఇంటిలోనే ఉన్న జోష్ణవి కనిపించకుండా పోయిందని ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె కోసం గాలిస్తున్నారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన సమయంలో జోష్ణవి బ్లూ కలర్ గౌను, బంగారు కమ్మలు, మాటీలు ధరించి ఉన్నదని, ఆమె ఆచూకీ తెలిసిన వారు 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

కురబలకోట, జూలై 7(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ పడమటి సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన శివశంకర్(52) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య పిల్లలు ఉన్నారు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. కాగా, సోమవారం ఉదయం అతను మరణించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేశారు. అతనిని ఎవరైనా హత్య చేశారా..లేక మద్యం కారణంగా మృతి చెందాడో తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సర్ట్) ఉస్మాన్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఝరికోన మొరవ మడుగులో ఆదివారం గల్లంతైన ఉస్మాన్ (22) మృతదేహాన్ని సోమవారం అగ్నిమాపక సి బ్బంది వెలికితీశారు. పో లీసులు తెలిపిన వివరాల మేరకు... కర్నూలు జిల్లాకు చెందిన మహమ్మద్ అస్లాం పెద్ద కుమారుడు ఉస్మాన్ రాయచోటిలో కోళ్ల ఫారంలో పని చేస్తుంటాడు. ఇతను రాయచోటి మదరసాలో చదువుకున్నాడు. శెట్టిపల్లి, దేవపట్ల అసంజివాండ్లపల్లె మసీదులో గురువులుగా పనిచేస్తున్న స్నేహితులతో కలిసి ఆదివారం ఝరికోన మడుగు ప్రాంతంలో సరదాగా గడిపేందుకు వెళ్లిన అతను ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. శెట్టిపల్లె గ్రామ వీఆర్‌ఏలు మృతదేహాన్ని వెతికించి శవ పరీక్షలకు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశా వర్కర్ ఆత్మహత్యాయత్నం



స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తన కుటుంబంపై జరిగిన దౌర్జన్య కాండతో మనస్తాపానికి గురైన ఓ ఆశా వర్కర్ ఆత్మాహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యుల కథనం మేరకు పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీలో కోళ్లపారానికి చెందిన బి.లక్ష్మీ దేవి(41) ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. అదే గ్రామానికి చెందిన పి.వెంకటరమణ, ఒ.బాలకృష్ణ, వి.రామ్మూర్తి, వి.గురునాథం, ఒ.నాగ రాజ అనే వ్యక్తులు ఆదివారం ఉదయం లక్ష్మీదేవి కుటుంబానికి చెందిన భూమిని ఆక్రమించుకోవడ మే కాకుండా, అడ్డుకోబోయిన ఆమెపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీదేవి విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. దానిని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

● పోలీసు అధికారులకు విద్యాసాగర్‌నాయుడు ఆదేశం



నడవలేని స్థితిలో ఉన్న బాధితుడి వద్దకే వచ్చి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ చేసి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదు చేయడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు తమకు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. అక్కడ ఇచ్చే ఫిర్యాదులను కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో బాధితులకు న్యాయం చేస్తామని తెలియజేశారు. జిల్లా పరిధిలోని ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు నుంచి పీ. వెంకట్రమణ, టీ. కొత్తకోట నుంచి పీ. మల్లేశ్వరమ్మ, కలకడ నుంచి వెంకటయ్య, రాయచోటి మండలం ఏపిల వంకపల్లి నుంచి నూర్జహాన్‌లు నడవలేని పరిస్థితిలో కూడా తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ నేరుగా వారి వద్దకే వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

14 ఎర్రచందనం దుంగలు పట్టివేత

● ముగ్గురి అరెస్ట్ .. ఒకరు పరార్



స్వాధీనం చేసుకున్న కారు, దుంగలు, నిందితులతో అటవీ సిబ్బంది

సిద్దవటం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి 14 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలిపారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె వివరాలు వెల్లడించారు. సిద్దవటం గ్రామ శివారులోని అంజనేయగుడి సమీపాన ఆదివారం అర్థరాత్రి దాడులు నిర్వహించగా కడప మండలం రామాంజనేయపురం ప్రాంతానికి చెందిన సన్నపూరి వెంకటరమణ, కొప్పర్తికి చెందిన సుబ్బారెడ్డి, సిద్దవటం మండలం కమ్మపాలేనికి చెందిన శిఖామణి పట్టుబడగా ఓ వ్యక్తి పారిపోయాడన్నారు. నిందితుల నుంచి 14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన వ్యక్తి తిరుపతి నగరానికి చెందిన గిరిబాబు అని విచారణలో తేలిందన్నారు. నిందితుల నుంచి ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను తిరుపతి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓబులేశు, ఎఫ్‌బీవో పెంచల్‌రెడ్డి, మధు, ఏబీవో హైమావతి, సైక్లింగ్ ఫోర్స్ సిబ్బంది సాహెబ్‌బావి బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

విషం తాగి ఒకరి ఆత్మహత్య



నారాయణ మృతదేహం

నందలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఇంటికి వచ్చినందుకు భార్య మందలిం చడంతో ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీకి చెందిన బొమ్మల నారాయణ(25) కడప పట్టణంలో ఇటుకల బట్టీలో పనిచేసేవాడు. అతనికి రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మునెమ్మతో వివాహం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతను విషం తాగాడు. ఈ విషయం గమనించిన భార్య రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


చిన్నమండెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చెర్లోపల్లి గ్రామ పంచాయతీ చీమలకుంటవారిపల్లెకు చెందిన కే. సుబ్బరాజ (61) కడప రిమ్స్‌కు తరలించగా ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నమండెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండ్లూరు గణపతి విగ్రహం మళ్లీ ధ్వంసం

● ఆరేళ్ల వ్యవధిలో మూడు సార్లు యత్నం

● స్థానికుల్లో ఆగ్రహం





మూడేళ్ళ క్రితం ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం, ఆదివారం ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన విగ్రహం

కలికిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరు మూలస్థానమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా వున్న వినాయక విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగుల పెకలించి దూరంగా తీసుకుపోయి ధ్వంసం చేసేందుకు విఫల ప్రయత్నం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం ఇదే మొదటిసారి కాదు. 2019లో ఒకసారి గుప్త నిధుల కోసం విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించి సాధ్యపడక వెళ్లిపోయారు. అనంతరం 2022 ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం అర్ధరాత్రి విగ్రహాన్ని పెకలించి గుప్త నిధుల కోసం ఉదర భాగాన్ని పగలగొట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. నెల్లూరుకు చెందిన ఒక ముఠా ఈ ప్రయత్నాలు చేయగా, స్థానికులు కూడా సహకరించినట్లు అప్పట్లో బలంగా ఆరోపణలు వచ్చాయి. పలు దఫాలుగా జరుగుతున్నా పోలీసులు తీవ్రంగా దర్యాప్తు చేయడం లేదనే ఆరోపణలతో గ్రామస్తులు పలు దఫాలు నిలదీసే వరకూ వెళ్ళింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఐదుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనుమానితులను తహసీల్దారు ముందు హాజరు పరిచి రూ.60 వేల పూచీకత్తుతో బైండోవరు చేయించి వదిలేశారు. దీంతో ఆగ్రహోదగ్రులైన గ్రామస్తులు పోలీసులకు వ్యతిరేకంగా రోడ్డు పైకి వచ్చే పరిస్థితి దాపురించింది. దుండగులతో కుమ్మక్కైన పోలీసులు కేసును నీరుగారుస్తున్నారనే ప్రచారం కూడా ఊపందుకుంది. రోజు రోజుకూ గ్రామస్తుల నుంచి వత్తిడి పెరగడంతో అప్పటి ఎస్‌ఐ ఉమామహేశ్వరావు 2022 ఫిబ్రవరి 8న గ్రామస్తులను సమావేశపరిచి వదంతులను నమ్మొద్దని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. వారం పది రోజుల్లో నిందితులను పట్టుకుని కేసును ఒక కొలిక్కి తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. ఈ లోగా విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని సూచించారు. అనంతరం ఫిబ్రవరి 19న మూలస్థానమ్మ ఆలయ నిర్వాహకులు వినాయక విగ్రహాన్ని సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠింపజేశారు. ఆ తరువాత కేసు దర్యాప్తు కూడా మూలన పడింది. మూడేళ్ళ అనంతరం మళ్లీ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి యత్నించడంతో పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటు మూలస్థానమ్మ ఆలయంలో కూడా తరచూ దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు కఠినంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాలిక అదృశ్యం... వేంపల్లెలో ఉద్రిక్తత

- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన బంధువులు
- అడ్డుకున్న పోలీసులు
- నాలుగుగంటలపాటు ఉద్రిక్తత
- బాలిక ఆచూకీ దొరకడంతో కథ సుఖాంతం


వేంపల్లె పోలీసు స్టేషన్ వద్ద గుమిగూడిన జనం


బాలికకు చక్కెర నీళ్లు తాపిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో ఓ బాలిక అనుమానాస్పద స్థితిలో అదృశ్యం కావడం.. ఆ బాలిక బంధువులు ఆందోళనకు దిగడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాలిక తరపు బంధువులు, కుటుంబ సభ్యులు, ఇతరులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. బాలిక అదృశ్యానికి కారణమై పోలీసులు అదుపులో ఉన్న యువకులను అప్పగించాలంటూ ఆగ్రహంతో పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. పోలీస్‌స్టేషన్ గోడలు ఎక్కి లోపలున్న యువకులను పట్టుకోవాలని విఫలయత్నం చేశారు. పోలీస్‌స్టేషన్ కిటికీ అద్దాలు పగులగొట్టారు. డీఎస్పీ మురళీనాయక్, చుట్టుపక్కల సీఐలు, ఎస్‌ఐలు చేరుకుని పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన జనాన్ని అడ్డుకున్నారు. నాలుగు గంటల పాటు నాటకీయ పరిణామాల అనంతరం బాలికను వెతుక్కుంటూ వెళ్లిన కొందరు బంధువులు ఆచూకీ తెలిసిందని పోలీస్‌స్టేషన్‌కు రాత్రి 10గంటల సమయంలో ఫోన్ చేశారు. దీంతో సీఐ నరసింహులు ఈ విషయం వారి బంధువులకు చెప్పడంతో ఉద్రిక్తత సద్దుమణిగి జనమంతా వెనుదిరిగి వెళ్లారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా...

వేంపల్లె పట్టణం పక్కీరుపల్లెకు చెందిన మాబువల్లి చింతలమడుగుపల్లె బట్లపల్లె వద్ద మేకల దొడ్డిని ఏర్పాటుచేసుకొని చుట్టుపక్కల అడవిప్రాంతం, పొలాల్లో మేపుకొనేవారు. సోమవారం భోజనం తీసుకెళ్లిన కుమార్తె సుమియ(18)ను కొంతసేపు మేకలు మేపుకొని రావాలంటూ తండ్రి సూచించడంతో తోలుకెళ్లింది. ఆ తర్వాత బాలిక అదృశ్యమైంది. తండ్రి కుమార్తె కోసం వెతుకగా కనిపించలేదు. మధ్యాహ్నం ప్రాంతంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాలిక కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ నరసింహులు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశారు. ఇంతలో ఓ వీడియో బయటకు వచ్చింది. ఆ వీడియోలో అదృశ్యమైన బాలిక సుమియ దండంపెడుతూ భయంభయంగా ఉన్నట్లు కనిపించింది. ఆ వీడియోల ఆధారంగా ముగ్గురు యువకులను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. అడవికి వెళ్లి బాలికతో మాట్లాడి వచ్చామని, తర్వాత ఏమైందో తెలియదని యువకులు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఎక్కడకు వెళ్లింది, ఏమై ఉంటుందో అన్న ప్రశ్నలతో ఆ యువకులను పూర్తిస్థాయిలో విచారించారు. ఈ లోగా బాలిక తరపు బంధువులు సాయంత్రం 6 గంటల నుంచే ఒక్కొక్కరుగా చేరుకున్నారు. పెద్దఎత్తున వందలాది మంది రాత్రి 7గంటల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బాలిక ఏమైందో చెప్పాలంటూ మొదట పోలీసులను ప్రశ్నించారు. అప్పటికి పోలీసులకు పూర్తి సమాచారం లేకపోవడంతో విచారణకు కొంత సమయం ఇవ్వాలని నచ్చజెప్పినప్పటికి గుమిగూడిన జనం పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. యువకులను అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్ కిటికీలను రాళ్లతో బద్దలు కొట్టారు. డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు వద్దంటున్నా లోపలకు వెళ్లేందుకు గట్టిగా ప్రయత్నించారు. అయితే పోలీసులు అడ్డుకొని చుట్టుపక్కల సీఐలు, ఎస్‌ఐలను పిలిపించుకొని జనాన్ని లోపలికి రాకుండా అడ్డుకున్నారు. గోడలు ఎక్కి పైనున్న యువకుల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారించారు. పోలీసులకు, జనానికి తీవ్ర తోపులాట జరిగింది. యువకులను ఏమైనా చేస్తారన్న అనుమానంతో కింద లాకప్‌లోకి తీసుకెళ్లి తాళాలు వేశారు. ఇలా సుమారు 5 గంటల పాటు వేంపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఏం జరుగుతుందోన్న ఆందోళనతో ప్రత్యేక పోలీసు దళం రావాలంటూ కడపకు సమాచారం ఇచ్చారు. ఈ లోగా రాత్రి 10గంటల సమయంలో బాలిక అదృశ్యంపై న్యాయం చేయాలంటూ ఫిర్యాదు పత్రాన్ని డీఎస్పీకి, సీఐకి అందించారు. అదే సమయంలో బంధువులు అడవిప్రాంతంలో వెతుకులాడేందుకు వెళ్లిన బంధువులకు బాలిక ఆచూకీ తెలిసింది. అక్కడి నుంచే ఫోన్ చేసి బాలిక క్షేమంగా ఉందంటూ సీఐ నరసింహులుకు తెలియజేశారు. ఆయన బాలిక తరపు బంధువులతో మాట్లాడించారు. దీంతో బాలిక క్షేమంగా ఉంది ఇప్పుడే సమాచారం అందింది వెంటనే అప్పగిస్తామంటూ డీఎస్పీ మురళీనాయక్ జనానికి విజ్ఞప్తి చేయడంతో పాటు అక్కడున్న పోలీసు బలగాలు జనాన్ని బయటకు వెళ్లాలని సూచించడంతో వెనుదిరిగి వెళ్లారు. హుటాహుటిన డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో బాలికను పిలుచుకొచ్చేందుకు రాత్రి 10గంటల సమయంలో అడవికి వెళ్లారు.

అసలేం జరిగిందంటే..

బాలిక అదృశ్యమైన ఘటనలో అసలు ఏం జరిగిందన్న విషయంపై పోలీసులు, స్థానికుల ద్వారా తెలిసిన వివరాల మేరకు.. బాలిక మేకలు మేపుకొనేందుకు మేకల దొడ్డి నుంచి వెళ్లింది. బాలికతో యువకులు మాట్లాడుకుంటుండగా మేకలు సమీప పొలంలోకి వెళ్లాయి. పొలం రైతు బాలిక తండ్రికి ఫోన్ చేశారు. మేకలు పొలంలోకి వచ్చాయి మీ పాప ఏం చేస్తోందంటూ అడగడంతో బాలిక తండ్రి మేకలు ఉన్న ప్రాంతానికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక భయాందోళనకు గురై తండ్రి చూస్తే అరుస్తాడేమోనన్న భయంతో అడవిలోకి పారిపోయింది. యువకులు ఇంటికి వచ్చేశారు. దీనితో బాలిక అదృశ్యమైనట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిమ్స్‌కు బాలిక..

అడవికి వెళ్లిన డీఎస్పీ మురళీనాయక్, పోలీసులు బాలికను వేంపల్లెకు తీసుకొచ్చి బంధువులకు చూపించారు. మధ్యాహ్నం నుంచి భోజనం లేకపోవడం, భయం కారణంగా మాట్లాడలేకుండా ఉన్న బాలికకు డీఎస్పీ చక్కెర నీళ్లు తాపించారు. అనంతరం వైద్యచికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి బాలిక క్షేమంగా ఉందని, అయితే నీరసంగా ఉండటంతో రిమ్స్‌కు తరలించామని అన్నారు. బాలిక మాట్లాడితే అడవిలో ఏం జరిగిందనేది తెలుస్తుందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న దంపతుల అరెస్టు

2.8 కేజీల గంజాయి, బైకు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి

కడప క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం డీటీసీ సర్కిల్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్న దంపతులను అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సోమవారం రిమ్స్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వల్లూరు మండలం తోళ్లగంగన్నపల్లె గ్రామానికి చెందిన చెన్నుబోయిన రాము గతంలో క్యాబ్ డ్రైవరుగా పని చేస్తుండేవాడు. ఆ సమయంలో కాకినాడ టౌన్ తుమ్మలపేటకు చెందిన వాసుపిల్లి భారతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీళ్లు కడప శాస్త్రినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎలాంటి పనులకు వెళ్లకుండా గంజాయి వ్యాపారం చేస్తే తక్కువ సమయంలో డబ్బులు బాగా సంపాదించవచ్చనే ఆశతో మహేశ్ నుంచి గంజాయి తెచ్చుకుని విక్రయించేవారు. సోమవారం డీటీసీ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో దంపతులు బైకుపై గంజాయి పెట్టుకుని వస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 2.8 కేజీల గంజాయి, బైకు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

మహిళా టీచర్ ఆత్మహత్యాయత్నం

మైదుకూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనిపెంట బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం జ్యోతి అనే బయాలజీ టీచర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పాఠశాలలో సరిగ్గా బోధన చేయడం లేదంటూ ప్రిన్సి పాల్ నిర్మల వేధింపులకు పాల్పడటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు విలేకరులకు తెలిపారు. ఆమెను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ నిర్మలను వివరణ కోరగా ఉదయం అసెంబ్లీ జరిగిన తరువాత జ్యోతి మేడం టీచింగ్ డైరీ, లెసన్ ప్లాన్‌పై సంతకం చేయాలని కోరారు. అయితే పని చేయని రోజులలో పనిచేసినట్లు రాసు కొచ్చారు. దీంతో నేను ఎలా సంతకం చేయాలని ప్రశ్నించి.. నేను ఇప్పుడు కొద్దిగా బిజీగా ఉన్నాను. తరువాత చూస్తాను అని చెప్పి పంపానని తెలిపారు. అయితే కొద్ది సేపటికే జ్యోతి మేడం నిద్ర మాత్రలు మింగారని మా స్టాఫ్ చెప్పగా వెళ్లి చూశాను. కానీ నేను మాట్లాడిన కొద్దిసేపటికే నిద్ర మాత్రలు ఆమెకు ఎలా వచ్చాయి.. నిద్రమాత్రలు మింగిన నిమిషాల్లోనే బయట వ్యక్తులు ఎలా పాఠశాలలోకి ఎలా వస్తారని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ప్రీప్లాన్‌గా చేస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే విచారించి ఎవరి తప్పు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి


శివారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య


జి.శివారెడ్డి (ఫైల్)

పులివెందుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉలిమెల్ల లైన్‌మన్ జి.శివారెడ్డి (45) విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. బంధువులు, విద్యుత్ సిబ్బంది సమాచారం మేరకు వివరాల్లోకెళితే..... ఉలిమెల్ల లైన్‌మన్‌గా పనిచేస్తున్న జి.శివారెడ్డి ఉదయం 7.30 గంటల ప్రాంతంలో డ్యూటీకి వెళ్లారు. ఓ చీనీతోటలో విద్యుత్ లైన్ మరమ్మత్తులకు గురికావడంతో సబ్‌స్టేషన్‌లో శివారెడ్డి ఎల్‌సీ తీసుకుని వెళ్లారు. కానీ మరమ్మత్తు పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో శివారెడ్డి షాక్‌కు గురై విద్యుత్ తీగలపైనే పడి మృతి చెందాడు. కాగా, శివారెడ్డి ఫోన్ రింగ్ అవుతున్నా ఎందుకు రాలేదని మరో లైన్‌మన్ ఆయను వెతుకుతూ వెళ్లగా.. విద్యుత్ స్తంభంపై మృతదేహం కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారితో కలిసి శివారెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. పోస్టుమార్టం నిర్వహించారు. శివారెడ్డి అన్న నాగరాజరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శివారెడ్డికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆఫీసుల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు : మంత్రి


సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్, జులై 7 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను పనులు చేయకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల పెట్టుబడులశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక 21వ వార్డులోని ఆకుల వీధిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలిసి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొందరు మహిళలు పెన్షన్, రేషన్ కార్డులు, హౌసింగ్ తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొంటారా అని మండిపడ్డారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాక్షస పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. అనంతరం కడప జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన వారోత్సవాల పోస్టర్‌ను మంత్రి, ఎమ్మెల్యేలు విడుదల చేశారు. పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, ఆకుల కృష్ణయ్య, తుపాకుల రమణ, ఆర్.శ్రీనివాసులు, పిచ్చపాటి వీరారెడ్డి, చిగురు పాటి సుబ్బరాయుడు, ధనపాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమంతో సుపరిపాలన : మంత్రి సవిత


పింఛన్లు వస్తున్నాయా అంటూ వృద్ధులను ఆరా తీస్తున్న మంత్రి

లింగాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమం కలగలిపిన సుపరిపాలన ఏడాదికాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు అందించారని రాష్ట్ర బీసీ సాంఘిక సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవిత అన్నారు. లింగాల ఆశ్రమంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే పరిపాలనలో అనేక మార్పులు చేపట్టి ప్రజలకు ఎన్నికలలో హామీ ఇచ్చిన మేరకు పింఛన్లను రూ.3వేలనుంచి రూ.4వేలకు, వికలాంగులకు రూ.6వేలకు పెంచడం జరిగిందన్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందిస్తూ దీపం పథకం అమలు చేయడం జరిగిందన్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని ఒకరికి పరిమితం చేయకుండా కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికీ అందిస్తూ రాష్ట్రంలో 67.27లక్షల మంది విద్యార్థులకు రూ.10వేలకోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేశారని, రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకువస్తూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. కాగా, అరటి రైతులకు పెట్టుబడి రాయితీ విడుదల కాలేదని, నియోజకవర్గం ప్రజలకు తాగునీటి సరఫరా చేసే వాటర్ గ్రిడ్ పనులలు నత్తనడకన సాగుతున్నాయని, విలేకరులు మంత్రి దృష్టికి తీసుకురాగా, పెట్టుబడి రాయితీ విడు దలకు, వాటర్ గ్రిడ్ పథకం పూర్తికి చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే ప్రజలు విన్నవించిన పలు సమస్యలను పరిష్కరించాలని సంబంధించిన శాఖ అధికారులను ఆదేశించారు. పులివెందుల టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ మద్యం ద్వారా దోచుకునేందుకు తనకు నచ్చిన బ్రాండ్లను ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాణ్యమైన మద్యం ప్రవేశపెట్టడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేయడం, ఉద్యాన రైతులకు ఎంతో అవసరమైన డ్రిప్ పరికరాలను దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి, ధనుంజయనాయుడు, బీజేపీ పులివెందుల నియోజకవర్గ కన్వీనర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితో ఉద్యాన తోటల పెంపకం

- జిల్లాలో 2700 ఎకరాల్లో సాగు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


టెంకాయ మొక్కలు నాటుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపాధి హామీతో ఉద్యాన తోటల పెంపకం చేపడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం సంబేపల్లె మండలం మోటకట్లకు చెందిన రైతు రాము, వంగిమళ్లవాండ్లపల్లెలో రైతు వంగిమళ్ల సురేశ్‌రెడ్డి పొలంలో డ్వామా పీడీ వెంకటరత్నంతో కలిసి కొబ్బరి మొక్క లు నాటి ఉద్యాన తోటల పెంపకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 2700 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన తోటల పెంపకాన్ని ఉపాధి హామీతో రైతులు చేపడుతున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు మండలాల్లో 1084 ఎకరాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో మామిడి తోటలు అధికంగా ఉన్నాయని, మామిడి కాకుండా సపోటా, దానిమ్మ, టెంకాయ వివిధ రకాల పండ్ల తోటలను పెంచుకోవాలని రైతులకు తెలి పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, ఏపీడీ మధుబాబు, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, ఏపీవో రెడ్డిజవహర్, శివప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శశిధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, దేవపట్ల ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, చంద్రబాబునాయుడు, సుబ్బరాజుయాదవ్, శేఖర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండగంగమ్మ ఆలయానికి రూ.2 లక్షల విరాళం

పెండ్లిమర్రి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నందిమండలం గ్రామ సమీపంలో పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన కొండగంగమ్మతల్లి ఆలయానికి రూ.2లక్షల విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ మారుతీ తెలిపారు. అనంతపురం పట్టణానికి చెందిన యతీష్‌రెడ్డి రూ.51,116 లు, శౌరీస్‌రెడ్డి రూ.51,116లు, పద్మావతి, నరసింహారెడ్డి దంపతులు రూ.1,01,116ల విరాళం అందచేశారన్నారు. ఈ నిధులను సీజీఫ్ మ్యాచింగ్ ఫండ్ ద్వారా ఆలయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ఉపయోగిస్తామని ఈఓ తెలిపారు.

నేడు ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ బాలుర ఎంపికలు

కడప స్పోర్ట్స్, జులై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈనెల 8వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాలుర జిల్లా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డేనియల్ ప్రదీప్ తెలిపారు. క్రీడాకారులు 2012 జనవరి 1 నుంచి 2013 డిసెంబరు 3 మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు.

బ్యానర్ తగిలిస్తూ..

కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు


మృతి చెందిన ఖాజాపీర్

మదనపల్లె అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): బ్యానర్ తగిలిస్తూ కరెంట్ షాక్ గురై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డులోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివ రాల మేరకు... గొల్లపల్లెకు చెందిన ఖాదర్‌బాషాకు మారుడు ఖజాపీర్ (29) బ్యానర్లకు లైటింగ్ వేసే పనిచేసేవాడు. సోమవారం రాత్రి సీటీఎం రోడ్డులోని కరెంటు ఆఫీస్ ఎదురుగా మిద్దెపై బ్యానర్ తగిలిస్తుండగా గాలి ఎక్కువగా రావ డంతో బ్యానర్ కరెంటు తీగలపై పడింది. వెంటనే కరెంటు షాక్‌కు గురై ఖాజా పీర్ అక్కడే మిద్దెపై కుప్పకూలిపోయాడు. స్థానికులు కిందకు దించి వెంటనే ఆటోలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన వ్యక్తిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిం చారని స్థానికులు తెలిపారు. అతని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారారహిత గ్రామాలుగా మారుద్దాం

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గురుప్రసాద్



ప్రజలతో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

సంబేపల్లె, జూలై 7(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0తో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో చైతన్యం తెచ్చి సారా రహిత గ్రామాలుగా మారుద్దామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గురుప్రసాద్ తెలిపారు. గురువారం శెట్టిపల్లి బీడికి, దుద్యాల వడ్డెపల్లె గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం తెచ్చి గ్రీన్ విలేజ్ సారా రహిత గ్రామాలుగా మార్చినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, అమ్మకాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. మారని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఆర్థిక జీవనోపాధి కోసం ఎన్నో మార్గాలు ఉన్నాయని, సారా వల్ల జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అభివృద్ధి చెందాలి: ఏపీఎం



గిరిజనులతో మాట్లాడుతున్న ఏపీఎం, కార్యదర్శి

చిట్వేలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు అభివృద్ధి వైపు నడవాలని రైల్వేకోడూరు నియోజకవర్గం ఏపీఎం రామచంద్రయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మారుమూల గిరిజన గ్రామాలైన రాజుకుంట, చెర్లోపల్లె, అనుంపల్లె కాలనీల్లో పంచాయతీ కార్యదర్శి రమణయ్యతో కలిసి పర్యటించారు. పాత అనుంపల్లె గిరిజనకాలనీలో మహిళలతో మాట్లాడుతూ జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని వన్ ధన్ వికాస్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, పొదుపు సంఘాలు ఏర్పాటు కావాలని అవగాహన కల్పించారు. గిరిజన కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సంక్షేమ సహాయకులు మణికృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

రైల్వేకోడూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె ఈ నెల 9న నిర్వహించనున్నారు. ఇందుకు మద్దతుగా సోమవారం ముందస్తుగా సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయవద్దని, కనీస వేతనాలు రూ.26,000లు చేయాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.జాన్‌ప్రసాద్, లింగాల యానాదయ్య, సుబ్రహ్మణ్యం, కనుపర్తి కిరణ్, హేమంత్, కుమార్‌రాజ, రమేష్, నారాయణ, చంగయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి: సీపీఐ



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): గాలివీడు మండలం అరవీడు గ్రామ పరిధిలోని నడింపల్లి దారి సౌకర్యం కల్పించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ శ్రీనివాసులు మాట్లాడారు. రెవెన్యూ అధికారులు చొరవ చూపి నడింపల్లి దారి సమస్య పరిష్కారానికి సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్

రైల్వేకోడూరు రూరల్, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): రెవెన్యూ కార్యాలయానికి వచ్చే బాధితుల సమస్యలపై వెంటనే స్పందించాలని తహసీల్దార్ అమర్నాథ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వచ్చిన ఫిర్యాదులపై స్థానిక వీఆర్వోలతో సమావేశమై వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

సుండుపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణపై మంగళవారం నియోజకవర్గ, మండల అబ్జర్వర్లు సుండుపల్లెకు రానున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కళ్లె రెడ్డెప్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి సమీపంలోని ఎంసీఆర్ కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



పొలాల్లో మొక్కలు నాటుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం వండాడి పంచాయతీ హరిజనవాడలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రైతుల పొలంలో మామిడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగి ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతుల పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటిన రైతులకు వాటి సంరక్షణ కొరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. రైతులందరూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకం చేపట్టి ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. జూలై 8వ తేదీన అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకాన్ని చేపట్టాలని డ్వామా పీడీ ఆదేశించడం జరిగిందని ఆ రోజు మంత్రివర్యులు అందుబాటులో ఉండకపోవడం వలన నేడు చిన్నమండెం మండలంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఉపాధి హామీ పథకం ఎంపీడీవో, ఏపీవోలు తెలిపారు.

ఏసీఎల్ విజేతగా చింతకాయలపల్లె



విజేత ట్రోఫీని అందుకుంటున్న చింతకాయలపల్లె జట్టు

నందలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అరవపల్లెలోని నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అరవపల్లె క్రికెట్ లీగ్ సీజన్-1 విజేతగా చింతకాయలపల్లె జట్టు ఆవిర్భవించింది. సోమవారం ఉదయం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అరవపల్లెకు చెందిన ఫాల్కన్ లెవన్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 14వ ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చింతకాయలపల్లె జట్టు 11.4 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 78 పరుగులు చేసి విజయం సాధించింది. విజేత జట్టులోని ఆటగాడు రూపేష్ 3 వికెట్లను తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రతి మ్యాచ్‌లో ప్రతిభ కనబరచిన ఈరి శివ మ్యాన్ ఆఫ్ ద సీరిస్‌ను సొంతం చేసుకున్నాడు. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఫైనల్ విజేత చింతకాయలపల్లె జట్టుకు రూ.30 వేలు ట్రోపీ అందజేశారు. జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కరిముల్లాఖాన్, షమివుల్లాఖాన్‌లు రూ.30 వేలను విజేత ట్రోఫీకి గుణయాదవ్ అందజేశారు. రన్నర్స్‌కి వరాకిల్ సాఫ్ట్‌వేర్ బృందం రూ.20 వేలు అందజేయగా రన్నర్స్ ట్రోఫీని యంబలూరు ప్రదీప్‌కుమార్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట సామ్రాజ్, టీడీపీ నాయకులు రెమో సురేష్, బీజేపీ నాయకులు జయకుమార్‌రెడ్డి, మురళీ, ఏసీఎల్ కమిటీ సభ్యులు బుల్లెట్ హరి, అరుణ్, మల్లెం రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

రాజంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సుబ్బయ్య ఆధ్వర్యంలో సోమవారం డీబీఎన్‌పల్లెలో జెండావిష్కరణ చేశారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు వెలగచర్ల శివయ్య పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు పెంచలయ్య, వెంకటేశ్, ఎంఈఎఫ్ రాజంపేట నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షుడు గడ్డం ఓబులేసు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు బడుగు, బలహీన వర్గాల కోసం, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పాటుపడుతున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, నాగేశ్వర, ఎంఎస్‌పీ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రాయచోటిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని వరిగపాపిరెడ్డిగారిపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం రాయచోటి మున్సిపాలిటీలోని 26వ వార్డు కౌన్సిలర్, వరిగ మాజీ సర్పంచ్ కుమారుడు కసిరెడ్డి వెంకటనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యే వ్యక్తి భవిష్యత్తును నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైసీపీ నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, రామాంజుల్‌రెడ్డి, బూత్ కన్వీనర్ సుబ్బారెడ్డి, వైసీపీ పట్టణ ఉపాధ్యక్షుడు నాగేంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానవతకు రూ.25 వేలు వితరణ

రాయచోటిటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మానవత సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై రూ.25 వేలు వితరణగా అందజేశారు. అసిస్టెంట్ మార్కెట్ కమిటీ సెక్రటరీ చమర్తి సువర్ణసుందరి, అచ్చిరాజు దంపతులు సోమవారం మానవత శాశ్వత సభ్యత్వం తీసుకుంటూ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు గానూ నగదు రూపంలో అందించినట్లు మానవతా సంస్థ చైర్మన్ శివగంగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాయచోటిశాఖ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డిలు పాల్గొన్నారు.

పోర్టల్‌లో ఫిర్యాదుల విభాగం ప్రారంభం

చిన్నమండెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఫిర్యాదుల విభాగాన్ని ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారులు తెలియజేశారు. ప్రాథమిక పరిశీలనలు, తిరస్కరించిన రికార్డులను, తహసీల్దార్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న రికార్డులు గ్రీవెన్స్ మాన్యువల్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే రైతులు తమ రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి అనుమానాలున్న టోల్ ఫ్రీ నెంబర్ 155251 ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

పీటీఎం సమావేశాలు ఏర్పాటు చేయాలి

గాలివీడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను ఈ నెల 10న పండుగ వాతావరణంలో చేయాలని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో పేరెంట్స్ టీచర్స్ సమావేశంపై కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండలంలోని ప్రధానోపాధ్యాయులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి తల్లికి గుర్తుగా ప్రతి అబ్బాయి, అమ్మాయి స్కూల్ ఆవరణంలో కానీ వారి గృహ ఆవరణంలో కానీ మొక్కలు నాటాలని తెలిపారు.

రీసోర్స్‌పర్సన్‌కు ఘన సన్మానం

పెనగలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రంపేట జడ్పీ ఉన్నత పాఠశాల రీసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్న అంబవరపు చెన్నయ్యకు చక్రంపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీఆర్‌ఎంటీపీ బాదుషా పాల్గొన్నారు. కార్యక్రమంలో చక్రంపేట పాఠశాల సిబ్బంది అన్వర్‌బాషా, కృష్ణకుమారి, పరిమిళ, మహేంద్ర, శివనరసింహులు, సుదర్శన్, శ్రీవాణి సతీష్‌బాబు, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

చిట్వేలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మె ఈ నెల 9న జరగనున్నదని, దీన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా నాయకుడు పందికాళ్ల మణి, వీఆర్‌ఏ సంఘం డివిజన్ అధ్యక్షుడు సుధాకర్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం వీరు స్థానిక తహసీల్దారు స్పందనకు సమ్మె నోటీసు ఇచ్చారు.

టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

ఒంటిమిట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమాచుపల్లె పంచాయతి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సాధు శ్రీనివాసులు ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిశీలకులు ఈశ్వరప్ప ఆధ్వర్యంలో గ్రామ కమిటీపై సమావేశం నిర్వహించారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

● ముక్కా రూపానందరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ ముక్కా

రైల్వేకోడూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కూడ చైర్మన్ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఉర్లగడ్డపోడు పంచాయతీలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమంలో కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, మైనారిటీ సీనియర్ నాయకులు పట్టాన్ మౌలా బాష, టీడీపీ యువ నాయకులు ఉడుము శివారెడ్డి, గిరి నాయుడు, మురళిరెడ్డి, సిద్ధేశ్వర తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు తొలి అడుగు

పెనగలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణ నెల్లూరులో సోమవారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి హాజరై ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సేవలు గురించి కరపత్రాలు ద్వారా వివరిస్తూ ఇంటింటికి తిరిగారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కె.కళాచంద్ర, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, దాసరి దామోదర్‌నాయుడు, నరసింహ, అమీరుల్లా, ఎం.శ్రీను, పాల్గొన్నారు.

తాళ్లపాక అభివృద్ధికి సహకరించండి



టీటీడీ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేటటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామం అభివృద్ధికి సహకరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడులు కోరారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య కుమారుడు ఉద్దండం సుబ్రమణ్యంలతో కలిసి టీటీడీ ఈవోను శ్యామలరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు రహదారిని వెడల్పు చేసి పలువురు కవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, ప్రముఖ న్యాయవాది వై.సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి ఇంటి స్థలం ఇవ్వాలి

● సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

రాయచోటిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉదయ్‌కిరణ్, జిల్లా కార్యదర్శి మాపులూరి విశ్వనాథ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల పేరుతో అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా సూపర్‌సిక్స్ హామీలను పక్కదారి మళ్లించి కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. అనంతరం బాధితులతో కలిసి రాయచోటి తహసీల్దార్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు, ఇంటి స్థలం మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఈ ధర్నాలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రమణ, రఘునాథ్‌నాయుడు, సుజాత, తుమ్మల లవకుమార్, ఆంజనేయులు, పెద్దన్న, సుబ్బమ్మ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేటటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కలిగిన రైతులు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ శివశంకర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల్లో 14188 మంది రైతులు ఉన్నారని, ఇంతవరకు ఈకేవైసీ ద్వారా 13436 మంది అర్హత సాధించారన్నారు. మిగిలిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

సూర్యఘర్‌పై అవగాహన సదస్సు

ఒంటిమిట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఉప్పరపల్లె గ్రామ సమీపంలో ఉన్న కనకదుర్గ కల్యాణమండపంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన వినియోగదారులు హాజరుకావాలన్నారు.

40 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు : ఏవో

సిద్దవటం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలానికి 40 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైనట్లు ఏవో ఎ.రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంజూరైన యూరియాను ఆయన పరిశీలించారు. వ్యవసాయాధికారి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మంజూరైన యూరియాను జూలై 8 నుంచి యూరియా పంపిణీ చేస్తామన్నారు. ఒక్క బస్తా విలువ రూ.266.50 అవుతుందని, ఆసక్తిగల రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాసుపుస్తకంతో సిద్దవటం వ్యవసాయ కార్యాలయానికి వచ్చి యూరియాను పొందాలని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు శివకుమార్, మౌనిక, మురళీధర్‌లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

రైల్వేకోడూరురూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మల రాధాకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అదానితో అక్రమంగా జరిపిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యసేవలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఓబులవారిపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డీఆర్ హరిత ఆధ్వర్యంలో కళాశాలలోని విద్యార్థులకు రక్త పరీక్షలు, ఎత్తు, బరువు ప్రమాణాలను పరీక్షించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాబోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిట్వేలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పత్తిగుంటవారిపల్లె 33 కేవీ ఫీడరు మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ చలపతిరావు ఓ ప్రకటనలో సోమవారం తెలియజేశారు. ఈ మేరకు పత్తిగుంటవారిపల్లె పరిధిలో ఉన్న పోల్లోపల్లె, ఈడిగపల్లె, గరుగుపల్లె గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

నిత్యపూజకోనలో శుభ్రత.. పరిశుభ్రత



మంచినీటి గుండాల్లో శుభ్రం చేస్తున్న దృశ్యం

సిద్దవటం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనలో శుభ్రత.. పరిశుభ్రత పాటించారు. ఎండోమెంట్ ఇన్‌చార్జి ఏవో శ్రీధర్ ఆధ్వర్యంలో పంచలింగాల కోన నుంచి కొండపైన ఆలయం వరకు ఉన్న కాలినడకన వెళ్లు మార్గంలో పాదరక్షలు, చెత్త, నీటిగుండాల్లో ఉన్న అపరిశుభ్రతను కూలీలతో తొలగింపజేశారు. అనంతరం నీటిగుండాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్ర, కూన విజయభాస్కర్, మాజీ చైర్మన్ బండి మునిరెడ్డి, శివభక్తులు పాల్గొన్నారు.

వినూత్నంగా ఆహ్వాన పత్రికలు



ఆహ్వాన పత్రికలు సిద్ధం చేస్తున్న విద్యార్థులు

పుల్లంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10న ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన మెగా పేరెంట్స్ మీటింగ్‌కు దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వినూత్నంగా ఆహ్వాన పత్రికలు తయారు చేశారు. ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో సోమవారం కలర్ పేపర్, స్ట్రాలు ఉపయోగించి అధికారులు, తల్లిదండ్రుల కోసం ఆహ్వాన పత్రికలను తయారు చేశారు. విద్యార్థుల బృందం రాజపత్రం నమూనాలో ఆహ్వాన పత్రం తయారు చేసి పంపడం విశేషం.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జీవో 36 అమలు కోసం సోమవారం 18వ రోజు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్యలు మాట్లాడుతూ పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులతో పాటు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కూడా రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు చెన్నయ్య, రాంబాబు, దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె - శివపురం రోడ్డుకు మోక్షమెప్పుడో..?

● అటవీ శాఖ అనుమతులు రాక ఆగిన పనులు ● రోడ్డు పూర్తైతే జిల్లా కేంద్రానికి తగ్గనున్న దూరం

తంబళ్లపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె-శివపురం రోడ్డుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని పడమటి మండలాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కడప, రా యచోటి ప్రాంతాల నుంచి తంబళ్లపల్లె మీదుగా బెంగ ళూరుకు వెళ్లేందుకు తంబళ పల్లె-శివపురం రోడ్డు ఏర్పా టు చేయాలని 2017లో అ ప్పటి టీడీపీ ప్రభుత్వం సంక ల్పించింది. పనులు ప్రారంభించి తంబళ్లపల్లె నుంచి సుమారు 3 కిలో మీటర్లు.. పెద్ద మండ్యం మం డలం సిద్దవరం నుంచి సు మారు 2 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశారు. మధ్య లో సుమారు 3 కిలోమీటర్లు అటవీ శాఖ పరిధిలో ఉండటం తో ఆ శాఖ నుంచి అనుమతులు రాక నిలిచిపోయింది. నాటి నుంచి నేటి దాకా ఈ రోడ్డు పనులు ఎ క్కడ వేసిన గొంగళి అక్కడేలాగా ఉండిపోయాయి. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. రోడ్డు, రవాణా శాఖ మంత్రిగా రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు. మంత్రి దృష్టి సారించి రోడ్డు పనలుఉ పూర్తి చేస్తే జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని పడమటి మండలాల ప్రజలు అంటున్నారు.



తంబళ్లపల్లె- శివపురం రోడ్డు

శివపురం రోడ్డుకు డిమాండ్

రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రం చేయడంతో తంబళ్లపల్లె-శివపురం రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలనే డిమాండ్ పెరిగి పోయింది. ప్రస్తుతం తంబళ్లపల్లెతో పాటు, ములకలచెరువు, బి. కొత్తకోట మండలాల ప్రజ లు, అధికారులు జిల్లా కేం ద్రానికి వెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంది. సాధారణ ప్రజలు బస్సుల్లో వెళ్లాలంటే తం బళ్లపల్లె మండల కేం ద్రం నుంచి ముదివేడు క్రాస్ వరకు వెళ్లి, అక్క డి నుంచి మరో బస్సు లో ఎక్కాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, ఇతర సొంత వాహనాల్లో అయితే మండల కేంద్రం నుంచి కన్నెమడుగు మఠం, అక్కడి నుంచి కోట కొండ, కుక్కరాజు పల్లె లేకుంటే కలిచెర్ల, గుర్రం కొండ మీదుగా వెళ్లాల్సి ఉంది. లేదా పెద్ద మండ్యం, చిన్న మం డ్యం మీదుగా రాయ చోటికి వెళ్లాల్సి ఉంది. ఈ రెండు మార్గాల గుండా తంబళ్లపల్లె నుంచి జిల్లా కేంద్రం సుమారు 65 నుంచి 70 కి.మీ దూరం ఉంటుంది. అదే శివపురం రోడ్డు పనులు పూర్తైతే తంబళ్లపల్లె నుంచి నేరుగా చిన్నమండ్యం మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. ఈ రోడ్డు ఏర్పాటు చేస్తే జిల్లా కేంద్రానికి ఇక్కడి నుంచి దాదాపు 20 కి.మీ పైన దూరం తగ్గే అవకాశం ఉంది.

తంబళ్లపల్లె మరింత అభివృద్ధి

తంబళ్లపల్లె-శివపురం రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే నియోజకవర్గ కేంద్రమైన తంబళ్లపల్లె మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. జిల్లా కేంద్రం నుంచి అతి తక్కువ సమయంలో తంబళ్లపల్లెకు చేరుకుని, అక్కడి నుంచి నేరుగా ములకలచెరువు, బి. కొత్తకోట మీదుగా బెంగళూరుకు చేరుకోవచ్చు. కడప, రాయచోటి, చిన్నమండ్యం, పెద్దమండ్యం తదితర ప్రాంతాల రైతులు సులభంగా బెంగళూరు, చింతామణి మార్కెట్లకు వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలు పెరిగి అన్ని వ్యాపార లావాదేవీలు పెరుగుతాయి. రవాణా సౌకర్యం పెరిగితే ఆ ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

అటవీ శాఖ అనుమతులే అడ్డు

రోడ్డు నిర్మాణంలో భాగంగా పోయే అటవీ భూమిని తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లె వద్ద సర్వే నెంబరు 2024/25లో సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని అటవీ శాఖకు కేటాయించినట్లు అధికారులు చెపుతున్నారు. అయితే, కరోనా లాక్‌డౌన్ , అధికారుల బదిలీ వంటి కారణలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

శివపురం రోడ్డు పూర్తి చేస్తాం

తంబళ్లపల్లె-శివపురం రోడ్డు పూర్తి చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 12 న తంబళ్లపల్లెలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రకటించారు. దీంతో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు మండలాల ప్రజల్లో ఆనందం నెలకొంది.

రోడ్డు నిర్మాణం పూర్తైతే మరింత అభివృద్ధి



తంబళ్లపల్లె-శివపురం రోడ్డును పూర్తి చేస్తే తంబళ్లపల్లె అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి ప్రజలు రాయచోటికి వెళ్లాల న్నా .. కడప, రాయచోటి ప్రాంతాల నుంచి బెంగళూరుకు వెళ్లాలన్న ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా రైతులు పండించిన పంటలు బెంగళూరుకు తరలించుకో వడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.

- బాలకృష్ణ, మండల నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం పూర్తి



తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డి నేతృత్వం లో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధి స్తోంది. తంబళ్లపల్లె- శివపురం రోడ్డు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మంత్రితో మాట్లాడి పూర్తి చేయడానికి కృషి చేస్తామని విజయోత్సవ ర్యాలీలో టీడీపీ ఇంచార్జి ప్రక టించారు. అదేకాకుండా కోసువారిపల్లె రోడ్డు, కాలువపల్లె రోడ్డు పనులు కూడా త్వరలో చేపట్టి ప్రజల రోడ్డు కష్టాలు తీరుస్తామని అన్నారు.

- డేరంగుల చంద్ర, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

● సబ్‌కలెక్టర్ నిదియాదేవి



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): ప్రజా పరిష్కార వేదికలో ప్రజలు అందజేస్తున్న అర్జీలను సంబంధిత శాఖ అధికారులు త్వరగా పరిష్కరించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియా దేవి అధికారులను సూచించారు. సోమవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదికలో పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అందులో భాగంగా ఊటుకూరు గ్రామ పొలానికి చెందిన సర్వేనంబరు 552, 1497లో పూర్వీకుల నుంచి తమ పొలాలకు వెళ్లేందుకు రస్తా ఉందన్నారు. కొందరు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. దీనిపై గతంలో రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు సర్వేచేసి హద్దులు ఏర్పరచారని తెలిపారు. 552 సర్వేనంబరులో 10 సెంట్లు స్థలం వంక పోరంబోకు అని తెలిపారు. కావున పొలానికి వెళ్లేందుకు దారి చూపాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించాలి: డీవైఈవో



శెట్టిపల్లె పాఠశాలను తనిఖీ చేస్తున్న డీవై ఈవో లోకేశ్వర్ రెడ్డి

వీలేరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని మదనపల్లె డీవై ఈవో లోకేశ్వర్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన వీలేరు మండలం రేగళ్లు పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లె ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా విద్య బోధించడం కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, ఉన్నతమైన విలువలు నేర్పించాలని సూచించారు. ఉపాధ్యా యులు విధిగా పని వేళలు పాటించాలని సూచించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులకు ఉచితంగా భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు తదితర విద్యాసామగ్రి ఇస్తున్నామని చెప్పారు. ప్రయివేట్ ప్రకటనలకు మోసపోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మెగా పేరెంట్స్ డేని విజయవంతం చేయాలని సూచించారు. ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, సీఆర్‌పీ మాధవి పాల్గొన్నారు.

మురుగు కాలువ పనులు ప్రారంభం



మురుగు కాలువ పనులు చేస్తున్న కార్మికులు

వీలేరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో మురుగు కాలువ నిర్మాణ పనులుప్రారంభమయ్యాయి. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'తవ్వేశారు ... వదిలేశారు' అన్న కథ నానికి స్పందించిన కాంట్రాక్టర్ యుద్ధ ప్రాతిపదికన సోమవారం పనులు ప్రారంబించారు. సుమారు ఏడు నెలల క్రితం మురుగు కాలువ నిర్మాణం కోసం జేసీబీతో కాలువను తవ్వి వదిలేశారు. దీంతో ఈ ప్రాంత వ్యాపారులు, వాహన చోదకులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఆంధ్రజ్యోతి గుర్తు చేసింది. దీంతో స్పందించిన వీలేరు గ్రామ పంచాయతీ అధికారులు, కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంబించారు. దీంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయండి

● తహసీల్దారుకు వీవోఏ వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘమిత్రలు

వాల్మీకిపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను సైతం పరిగణనలోకి తీసుకోకుండా తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని వాల్మీకిపురం మండలంలోని చింతపర్తికి చెందిన సంఘమిత్ర సుమలత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ పామిలేటిని కలిసి వినతి పత్రం అందజేశారు. చింతపర్తి గ్రామం 6 వీవోఏ (సంఘమిత్ర)గా పనిచేస్తున్న తాను కొన్ని ఇబ్బందుల కారణంగా విధులకు దూరంగా ఉన్నానని, సంఘమిత్రగా కొనసాగేందుకు గతంలో హైకోర్టును ఆశ్రయించగా, గతేడాది సెప్టెంబరు 12న సంఘమిత్రగా కొనసాగించేందుకు ఉత్తర్వులు కూడా ఇచ్చిందన్నారు. అయితే విధుల్లోకి తీసుకుండా సంబంధిత అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

రిటైరయిన ఆరేళ్లకు మధ్యంతర పెన్షన్ మంజూరు

● విచారణ ఎదుర్కొంటున్న ఏడీఏ సోమశేఖర్ రెడ్డి

కలికిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వివిధ ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న ఒక అధికారికి ఉద్యోగం నుంచి రిటైరయిన ఆరేళ్ల తరువాత మధ్యంతర పెన్షన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ శాఖలో కె.సోమశేఖర్ రెడ్డి కడప అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసే కాలంలో కొన్ని అభియోగాలు నమోదయ్యాయి. వీటిపై విచారణ జరుతుండగానే ఆయన 2019 జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. అయితే విచారణ కారణంగా అప్పటి నుంచి ఆయనకు పెన్షన్ మంజూరు కాలేదు. పదవీ విరమణానంతరం అందాల్సిన ప్రయోజనాలేవీ అందలేదు. విచారణలో జాప్యం జరుగుతున్న కారణంగా తనకు కనీసం మధ్యంతర పెన్షన్ మంజూరు చేయాలని గత మార్చి నెలలో ఆయన చేసుకున్న విన్నపాన్ని పరిశీలించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టరు గత జూన్ 18న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. పరిశీలించిన ప్రభుత్వం మధ్యంతర పెన్షను మంజూరుకు సంబంధించిన నియమాల మేరకు మొత్తం పెన్షన్ రూ.28,845లో 75 శాతం మించకుండా చెల్లించాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా నిబంధనల మేరకు రావలసిన పెన్షన్‌లో రూ.21,634లు మంజూరు చేసింది. కమ్యుటేషన్, గ్రాట్యుటీ, తదితర పదవీ విరమణానంతరం చెల్లించాల్సిన ప్రయోజనాలన్నీ విచారణ పూర్తయ్యే వరకూ పెండింగ్‌లో ఉంచాల్సిందిగా తెలియజేస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

హంసవాహనంపై సిద్దేశ్వరుడి విహారం



హంస వాహనంపై విహరిస్తున్న సిద్దేశ్వరస్వామి

రాజంపేట టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామిని, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారిని ప్రత్యేకఅలంకరణలో కొలువు దీర్చారు. హంస వాహనంపై సిద్దేశ్వరస్వామిని, చిన్నశేష వాహనంపై చెన్నకేశవస్వాములను తాళ్లపాక మాడవీధుల్లో ఊరేగించారు. చివరగా చెన్నకేశవస్వామివారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరికి టీటీడీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు



జోష్ణవి (ఫైల్ ఫొటో)

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తమ కూతురు కనిపించడం లేదంటూ పట్టణంలోని బండ్లవంకకు చెందిన సునీత ఫిర్యాదు చేసినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరులోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో జోష్ణవి 8వ తరగతి చదువుతుండగా, ఆమె తల్లి సునీత అదే పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తోంది. ఆదివారం జోష్ణవి జన్మదినం కావడంతో సునీత తన కూతురిని ఇంటికి తీసుకెళ్లింది. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ఇంటిలోనే ఉన్న జోష్ణవి కనిపించకుండా పోయిందని ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె కోసం గాలిస్తున్నారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన సమయంలో జోష్ణవి బ్లూ కలర్ గౌను, బంగారు కమ్మలు, మాటీలు ధరించి ఉన్నదని, ఆమె ఆచూకీ తెలిసిన వారు 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

కురబలకోట, జూలై 7(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ పడమటి సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన శివశంకర్(52) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య పిల్లలు ఉన్నారు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. కాగా, సోమవారం ఉదయం అతను మరణించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేశారు. అతనిని ఎవరైనా హత్య చేశారా..లేక మద్యం కారణంగా మృతి చెందాడో తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సర్ట్) ఉస్మాన్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఝరికోన మొరవ మడుగులో ఆదివారం గల్లంతైన ఉస్మాన్ (22) మృతదేహాన్ని సోమవారం అగ్నిమాపక సి బ్బంది వెలికితీశారు. పో లీసులు తెలిపిన వివరాల మేరకు... కర్నూలు జిల్లాకు చెందిన మహమ్మద్ అస్లాం పెద్ద కుమారుడు ఉస్మాన్ రాయచోటిలో కోళ్ల ఫారంలో పని చేస్తుంటాడు. ఇతను రాయచోటి మదరసాలో చదువుకున్నాడు. శెట్టిపల్లి, దేవపట్ల అసంజివాండ్లపల్లె మసీదులో గురువులుగా పనిచేస్తున్న స్నేహితులతో కలిసి ఆదివారం ఝరికోన మడుగు ప్రాంతంలో సరదాగా గడిపేందుకు వెళ్లిన అతను ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. శెట్టిపల్లె గ్రామ వీఆర్‌ఏలు మృతదేహాన్ని వెతికించి శవ పరీక్షలకు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశా వర్కర్ ఆత్మహత్యాయత్నం



స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తన కుటుంబంపై జరిగిన దౌర్జన్య కాండతో మనస్తాపానికి గురైన ఓ ఆశా వర్కర్ ఆత్మాహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యుల కథనం మేరకు పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీలో కోళ్లఫారానికి చెందిన బి.లక్ష్మీ దేవి(41) ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. అదే గ్రామానికి చెందిన పి.వెంకటరమణ, ఒ.బాలకృష్ణ, వి.రామ్మూర్తి, వి.గురునాథం, ఒ.నాగ రాజ అనే వ్యక్తులు ఆదివారం ఉదయం లక్ష్మీదేవి కుటుంబానికి చెందిన భూమిని ఆక్రమించుకోవడ మే కాకుండా, అడ్డుకోబోయిన ఆమెపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీదేవి విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. దానిని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

● పోలీసు అధికారులకు విద్యాసాగర్‌నాయుడు ఆదేశం



నడవలేని స్థితిలో ఉన్న బాధితుడి వద్దకే వచ్చి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ చేసి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదు చేయడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు తమకు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. అక్కడ ఇచ్చే ఫిర్యాదులను కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో బాధితులకు న్యాయం చేస్తామని తెలియజేశారు. జిల్లా పరిధిలోని ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు నుంచి పీ. వెంకట్రమణ, టీ. కొత్తకోట నుంచి పీ. మల్లేశ్వరమ్మ, కలకడ నుంచి వెంకటయ్య, రాయచోటి మండలం ఏపిలవంకపల్లి నుంచి నూర్జహాన్‌లు నడవలేని పరిస్థితిలో కూడా తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ నేరుగా వారి వద్దకే వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

14 ఎర్రచందనం దుంగలు పట్టివేత

●ముగ్గురి అరెస్ట్ .. ఒకరు పరార్



స్వాధీనం చేసుకున్న కారు, దుంగలు, నిందితులతో అటవీ సిబ్బంది

సిద్దవటం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి 14 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలిపారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె వివరాలు వెల్లడించారు. సిద్దవటం గ్రామ శివారులోని ఆంజనేయగుడి సమీపాన ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించగా కడప మండలం రామాంజనేయపురం ప్రాంతానికి చెందిన సన్నపూరి వెంకటరమణ, కొప్పర్తికి చెందిన సుబ్బారెడ్డి, సిద్దవటం మండలం కమ్మపాలేనికి చెందిన శిఖామణి పట్టుబడగా ఓ వ్యక్తి పారిపోయాడన్నారు. నిందితుల నుంచి 14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన వ్యక్తి తిరుపతి నగరానికి చెందిన గిరిబాబు అని విచారణలో తేలిందన్నారు. నిందితుల నుంచి ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను తిరుపతి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓబులేశు, ఎఫ్‌బీవో పెంచల్‌రెడ్డి, మధు, ఏబీవో హైమావతి, సైక్లింగ్ ఫోర్స్ సిబ్బంది సాహెబ్‌బావి బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

విషం తాగి ఒకరి ఆత్మహత్య



నారాయణ మృతదేహం

నందలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఇంటికి వచ్చినందుకు భార్య మందలిం చడంతో ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీకి చెందిన బొమ్మల నారాయణ(25) కడప పట్టణంలో ఇటుకల బట్టీలో పనిచేసేవాడు. అతనికి రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మునెమ్మతో వివాహం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతను విషం తాగాడు. ఈ విషయం గమనించిన భార్య రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నమండెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చెర్లోపల్లి గ్రామ పంచాయతీ చీమలకుంటవారిపల్లెకు చెందిన కే. సుబ్బరాజ (61) కడప రిమ్స్‌కు తరలించగా ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నమండెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండ్లూరు గణపతి విగ్రహం మళ్లీ ధ్వంసం

● ఆరేళ్ల వ్యవధిలో మూడు సార్లు యత్నం

● స్థానికుల్లో ఆగ్రహం





మూడేళ్ళ క్రితం ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం, ఆదివారం ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన విగ్రహం

కలికిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరు మూలస్థానమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా వున్న వినాయక విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగుల పెకలించి దూరంగా తీసుకుపోయి ధ్వంసం చేసేందుకు విఫల ప్రయత్నం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం ఇదే మొదటిసారి కాదు. 2019లో ఒకసారి గుప్త నిధుల కోసం విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించి సాధ్యపడక వెళ్లిపోయారు. అనంతరం 2022 ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం అర్ధరాత్రి విగ్రహాన్ని పెకలించి గుప్త నిధుల కోసం ఉదర భాగాన్ని పగలగొట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. నెల్లూరుకు చెందిన ఒక ముఠా ఈ ప్రయత్నాలు చేయగా, స్థానికులు కూడా సహకరించినట్లు అప్పట్లో బలంగా ఆరోపణలు వచ్చాయి. పలు దఫాలుగా జరుగుతున్నా పోలీసులు తీవ్రంగా దర్యాప్తు చేయడం లేదనే ఆరోపణలతో గ్రామస్తులు పలు దఫాలు నిలదీసే వరకూ వెళ్ళింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఐదుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనుమానితులను తహసీల్దారు ముందు హాజరుపరిచి రూ.60 వేల పూచీకత్తుతో బైండోవరు చేయించి వదిలేశారు. దీంతో ఆగ్రహోదగ్రులైన గ్రామస్తులు పోలీసులకు వ్యతిరేకంగా రోడ్డు పైకి వచ్చే పరిస్థితి దాపురించింది. దుండగులతో కుమ్మక్కైన పోలీసులు కేసును నీరుగారుస్తున్నారనే ప్రచారం కూడా ఊపందుకుంది. రోజు రోజుకూ గ్రామస్తుల నుంచి వత్తిడి పెరగడంతో అప్పటి ఎస్‌ఐ ఉమామహేశ్వరావు 2022 ఫిబ్రవరి 8న గ్రామస్తులను సమావేశపరిచి వదంతులను నమ్మొద్దని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. వారం పది రోజుల్లో నిందితులను పట్టుకుని కేసును ఒక కొలిక్కి తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. ఈ లోగా విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని సూచించారు. అనంతరం ఫిబ్రవరి 19న మూలస్థానమ్మ ఆలయ నిర్వాహకులు వినాయక విగ్రహాన్ని సంప్రదాయబద్దంగా ప్రతిష్ఠింపజేశారు. ఆ తరువాత కేసు దర్యాప్తు కూడా మూలన పడింది. మూడేళ్ళ అనంతరం మళ్లీ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి యత్నించడంతో పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటు మూలస్థానమ్మ ఆలయంలో కూడా తరచూ దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు కఠినంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాలిక అదృశ్యం... వేంపల్లెలో ఉద్రిక్తత

- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన బంధువులు
- అడ్డుకున్న పోలీసులు
- నాలుగుగంటలపాటు ఉద్రిక్తత
- బాలిక ఆచూకీ దొరకడంతో కథ సుఖాంతం


వేంపల్లె పోలీసు స్టేషన్ వద్ద గుమిగూడిన జనం


బాలికకు చక్కెర నీళ్లు తాపిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో ఓ బాలిక అనుమానాస్పద స్థితిలో అదృశ్యం కావడం.. ఆ బాలిక బంధువులు ఆందోళనకు దిగడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాలిక తరపు బంధువులు, కుటుంబ సభ్యులు, ఇతరులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. బాలిక అదృశ్యానికి కారణమైన పోలీసులు అదుపులో ఉన్న యువకులను అప్పగించాలంటూ ఆగ్రహంతో పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. పోలీస్‌స్టేషన్ గోడలు ఎక్కి లోపలున్న యువకులను పట్టుకోవాలని విఫలయత్నం చేశారు. పోలీస్‌స్టేషన్ కిటికీ అద్దాలు పగులగొట్టారు. డీఎస్పీ మురళీనాయక్, చుట్టుపక్కల సీఐలు, ఎస్ఐలు చేరుకుని పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన జనాన్ని అడ్డుకున్నారు. నాలుగు గంటల పాటు నాటకీయ పరిణామాల అనంతరం బాలికను వెతుక్కుంటూ వెళ్లిన కొందరు బంధువులు ఆచూకీ తెలిసిందని పోలీస్‌స్టేషన్‌కు రాత్రి 10గంటల సమయంలో ఫోన్ చేశారు. దీంతో సీఐ నరసింహులు ఈ విషయం వారి బంధువులకు చెప్పడంతో ఉద్రిక్తత సద్దుమణిగి జనమంతా వెనుదిరిగి వెళ్లారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా...

వేంపల్లె పట్టణం పక్కీరుపల్లెకు చెందిన మాబువల్లి చింతలమడుగుపల్లె బట్లపల్లె వద్ద మేకల దొడ్డిని ఏర్పాటుచేసుకొని చుట్టుపక్కల అడవిప్రాంతం, పొలాల్లో మేపుకొనేవారు. సోమవారం భోజనం తీసుకెళ్లిన కుమార్తె సుమియ(18)ను కొంతసేపు మేకలు మేపుకొని రావాలంటూ తండ్రి సూచించడంతో తోలుకెళ్లింది. ఆ తర్వాత బాలిక అదృశ్యమైంది. తండ్రి కుమార్తె కోసం వెతుకగా కనిపించలేదు. మధ్యాహ్నం ప్రాంతంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాలిక కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ నరసింహులు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశారు. ఇంతలో ఓ వీడియో బయటకు వచ్చింది. ఆ వీడియోలో అదృశ్యమైన బాలిక సుమియ దండంపెడుతూ భయంభయంగా ఉన్నట్లు కనిపించింది. ఆ వీడియోల ఆధారంగా ముగ్గురు యువకులను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. అడవికి వెళ్లి బాలికతో మాట్లాడి వచ్చామని, తర్వాత ఏమైందో తెలియదని యువకులు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఎక్కడకు వెళ్లింది, ఏమై ఉంటుందో అన్న ప్రశ్నలతో ఆ యువకులను పూర్తిస్థాయిలో విచారించారు. ఈ లోగా బాలిక తరపు బంధువులు సాయంత్రం 6 గంటల నుంచే ఒక్కొక్కరుగా చేరుకున్నారు. పెద్దఎత్తున వందలాది మంది రాత్రి 7గంటల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బాలిక ఏమైందో చెప్పాలంటూ మొదట పోలీసులను ప్రశ్నించారు. అప్పటికి పోలీసులకు పూర్తి సమాచారం లేకపోవడంతో విచారణకు కొంత సమయం ఇవ్వాలని నచ్చజెప్పినప్పటికి గుమిగూడిన జనం పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. యువకులను అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్ కిటికీలను రాళ్లతో బద్దలు కొట్టారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు వద్దంటున్నా లోపలకు వెళ్లేందుకు గట్టిగా ప్రయత్నించారు. అయితే పోలీసులు అడ్డుకొని చుట్టుపక్కల సీఐలు, ఎస్ఐలను పిలిపించుకొని జనాన్ని లోపలికి రాకుండా అడ్డుకున్నారు. గోడలు ఎక్కి పైనున్న యువకుల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారించారు. పోలీసులకు, జనానికి తీవ్ర తోపులాట జరిగింది. యువకులను ఏమైనా చేస్తారన్న అనుమానంతో కింద లాకప్‌లోకి తీసుకెళ్లి తాళాలు వేశారు. ఇలా సుమారు 5 గంటల పాటు వేంపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఏం జరుగుతుందోన్న ఆందోళనతో ప్రత్యేక పోలీసు దళం రావాలంటూ కడపకు సమాచారం ఇచ్చారు. ఈ లోగా రాత్రి 10గంటల సమయంలో బాలిక అదృశ్యంపై న్యాయం చేయాలంటూ ఫిర్యాదు పత్రాన్ని డీఎస్పీకి, సీఐకి అందించారు. అదే సమయంలో బంధువులు అడవిప్రాంతంలో వెతుకులాడేందుకు వెళ్లిన బంధువులకు బాలిక ఆచూకీ తెలిసింది. అక్కడి నుంచే ఫోన్ చేసి బాలిక క్షేమంగా ఉందంటూ సీఐ నరసింహులుకు తెలియజేశారు. ఆయన బాలిక తరపు బంధువులతో మాట్లాడించారు. దీంతో బాలిక క్షేమంగా ఉంది ఇప్పుడే సమాచారం అందింది వెంటనే అప్పగిస్తామంటూ డీఎస్పీ మురళీనాయక్ జనానికి విజ్ఞప్తి చేయడంతో పాటు అక్కడున్న పోలీసు బలగాలు జనాన్ని బయటకు వెళ్లాలని సూచంచడంతో వెనుదిరిగి వెళ్లారు. హుటాహుటిన డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో బాలికను పిలుచుకొచ్చేందుకు రాత్రి 10గంటల సమయంలో అడవికి వెళ్లారు.

అసలేం జరిగిందంటే..

బాలిక అదృశ్యమైన ఘటనలో అసలు ఏం జరిగిందన్న విషయంపై పోలీసులు, స్థానికుల ద్వారా తెలిసిన వివరాల మేరకు.. బాలిక మేకలు మేపుకొనేందుకు మేకల దొడ్డి నుంచి వెళ్లింది. బాలికతో యువకులు మాట్లాడుకుంటుండగా మేకలు సమీప పొలంలోకి వెళ్లాయి. పొలం రైతు బాలిక తండ్రికి ఫోన్ చేశారు. మేకలు పొలంలోకి వచ్చాయి మీ పాప ఏం చేస్తోందంటూ అడగడంతో బాలిక తండ్రి మేకలు ఉన్న ప్రాంతానికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక భయాందోళనకు గురై తండ్రి చూస్తే అరుస్తాడేమోనన్న భయంతో అడవిలోకి పారిపోయింది. యువకులు ఇంటికి వచ్చేశారు. దీనితో బాలిక అదృశ్యమైనట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిమ్స్‌కు బాలిక..

అడవికి వెళ్లిన డీఎస్పీ మురళీనాయక్, పోలీసులు బాలికను వేంపల్లెకు తీసుకొచ్చి బంధువులకు చూపించారు. మధ్యాహ్నం నుంచి భోజనం లేకపోవడం, భయం కారణంగా మాట్లాడలేకుండా ఉన్న బాలికకు డీఎస్పీ చక్కెర నీళ్లు తాపించారు. అనంతరం వైద్యచికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి బాలిక క్షేమంగా ఉందని, అయితే నీరసంగా ఉండటంతో రిమ్స్‌కు తరలించామని అన్నారు. బాలిక మాట్లాడితే అడవిలో ఏం జరిగిందనేది తెలుస్తుందన్నారు.

హత్య కేసులో నిందితురాలు అరెస్టు


నిందితురాలి అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితురాలును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మహేం ద్ర తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆ వివరాలను మీడి యాకు వివరించారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె గ్రామం రెడ్డిగానిపల్లెలోని వీరభద్ర కుమారుడు చంద్రశేఖర్ (46) మేస్త్రీగా పని చేస్తూ జీవించేవాడు. ఇరవై ఏళ్ల క్రితం సదుం మండలం పాలమందకు చెందిన రమాదేవితో చంద్రశేఖర్‌కు వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. ప్రతిరోజు చంద్రశే ఖర్ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో ఘర్షణ పడేవాడు. అంతే కాక భార్య కూలి పనులకు వెళ్లి తెచ్చిన డబ్బులను కూడా తాగుడికి తగలేసేవాడు. ఈక్రమంలో ఆమె పాలెంకొండకు చెందిన మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. ఇటీవల ప్రభుత్వం నుం చి వచ్చిన తల్లికి వందనం డబ్బులు ఇవ్వనందున చంద్రశేఖర్ భార్యతో గొడవ పడ్డాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి రమాదేవి తన పిల్లలతో ఇంటి బయట పడుకొని ఉండగా చంద్రశేఖర్ బాగా మద్యం తాగి వచ్చి వెంట తెచ్చుకున్న మద్యం లోకి నీళ్లు కావాలని కోరాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న తన భార్య రమాదేవి మద్యం గ్లాసులో విషం కలిపి ఇచ్చింది. మద్యం మత్తులో ఆమెతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె తన భర్త గొంతు నొక్కేసింది. తర్వాత భర్తను ఇంట్లోనే వదిలేసి బయట పడుకుంది. వేకువ జామున తన భర్త రక్తం కక్కుకొని ఇంట్లో చనిపోయి ఉండగా అక్కడ ఉన్న రక్తం గుడ్డతో తుడిచి ఉదయం కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తన భర్త చనిపోయినట్లు ఇరుగుపొరుగు వారికి చెప్పింది. విషయం తెలుసుకున్న మృతుడి తమ్ముడు మహేష్ తిరుపతి నుంచి రెడ్డిగానిపల్లెకు వచ్చేటప్పటికే అనుమానం రాకుం డా పూలమాలలు వేసి అంత్యక్రియలకు సిద్ధం చేసింది. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తాలుకా సీఐ కళా వెంకటరమణ విచారణ చేపట్టారు. దీంతో నిందితురాలను సోమవారం సాయంత్రం ఎర్రగానిమిట్ట వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న దంపతుల అరెస్టు

కడప క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం డీటీసీ సర్కిల్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్న దంపతులను అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సోమవారం రిమ్స్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వల్లూరు మండలం తోళ్లగంగన్నపల్లె గ్రామానికి చెందిన చెన్నుబోయిన రాము గతంలో క్యాబ్ డ్రైవరుగా పని చేస్తుండేవాడు. ఆ సమయంలో కాకినాడ టౌన్ తుమ్మలపేటకు చెందిన వాసుపిల్లి భారతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీళ్లు కడప శాస్త్రినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎలాంటి పనులకు వెళ్లకుండా గంజాయి వ్యాపారం చేస్తే తక్కువ సమయంలో డబ్బులు బాగా సంపాదించవచ్చనే ఆశతో మహేశ్ నుంచి గంజాయి తెచ్చుకుని విక్రయించేవారు. సోమవారం డీటీసీ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో దంపతులు బైకుపై గంజాయి పెట్టుకుని వస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 2.8 కేజీల గంజాయి, బైకు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి



శివారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, శివారెడ్డి (ఫైల్)

పులివెందుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉలిమెల్ల లైన్‌మన్ జి.శివారెడ్డి (45) విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. బంధువులు, విద్యుత్ సిబ్బంది సమాచారం మేరకు వివరాల్లోకెళితే..... ఉలిమెల్ల లైన్మ్యాన్‌గా పనిచేస్తున్న జి.శివారెడ్డి ఉదయం 7.30 గంటల ప్రాంతంలో డ్యూటీకి వెళ్లారు. ఓ చీనీతోటలో విద్యుత్ లైన్ మర మ్మత్తులకు గురికావడంతో సబ్ స్టేషన్‌లో శివారెడ్డి ఎల్‌సీ తీసుకుని వెళ్లారు. కానీ మరమ్మత్తు పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో శివారెడ్డి షాక్‌కు గురై విద్యుత్ తీగలపైనే పడి మృతి చెందాడు. కాగా, శివారెడ్డి ఫోన్ రింగ్ అవుతున్నా ఎందుకు రాలేదని మరో లైన్‌మన్ ఆయను వెతుకుతూ వెళ్లగా.. విద్యుత్ స్తంభంపై మృతదేహం కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారితో కలిసి శివారెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. పోస్టుమార్టం నిర్వహించారు. శివారెడ్డి అన్న నాగరాజరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శివారెడ్డికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆఫీసుల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు : మంత్రి


సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్, జులై 7 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను పనులు చేయకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల పెట్టుబడులశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక 21వ వార్డులోని ఆకుల వీధిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలిసి మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొందరు మహిళలు పెన్షన్, రేషన్ కార్డులు, హౌసింగ్ తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొంటారా అని మండిపడ్డారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాక్షస పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. అనంతరం కడప జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన వారోత్సవాల పోస్టర్‌ను మంత్రి, ఎమ్మెల్యేలు విడుదల చేశారు. పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, ఆకుల కృష్ణయ్య, తుపాకుల రమణ, ఆర్.శ్రీనివాసులు, పిచ్చపాటి వీరారెడ్డి, చిగురుపాటి సుబ్బరాయుడు, ధనపాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమంతో సుపరిపాలన : మంత్రి సవిత


పింఛన్లు వస్తున్నాయా అంటూ వృద్ధులను ఆరా తీస్తున్న మంత్రి

లింగాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమం కలగలిపిన సుపరిపాలన ఏడాదికాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు అందించారని రాష్ట్ర బీసీ సాంఘిక సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవిత అన్నారు. లింగాల ఆశ్రమంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే పరిపాలనలో అనేక మార్పులు చేపట్టి ప్రజలకు ఎన్నికలలో హామీ ఇచ్చిన మేరకు పింఛన్లను రూ.3వేలనుంచి రూ.4వేలకు, వికలాంగులకు రూ.6వేలకు పెంచడం జరిగిందన్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందిస్తూ దీపం పథకం అమలు చేయడం జరిగిందన్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని ఒకరికి పరిమితం చేయకుండా కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికీ అందిస్తూ రాష్ట్రంలో 67.27లక్షల మంది విద్యార్థులకు రూ.10వేలకోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేశారని, రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకువస్తూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. కాగా, అరటి రైతులకు పెట్టుబడి రాయితీ విడుదల కాలేదని, నియోజకవర్గం ప్రజలకు తాగునీటి సరఫరా చేసే వాటర్ గ్రిడ్ పనులలు నత్తనడకన సాగుతున్నాయని, విలేకరులు మంత్రి దృష్టికి తీసుకురాగా, పెట్టుబడి రాయితీ విడు దలకు, వాటర్ గ్రిడ్ పథకం పూర్తికి చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే ప్రజలు విన్నవించిన పలు సమస్యలను పరిష్కరించాలని సంబంధించిన శాఖ అధికారులను ఆదేశించారు. పులివెందుల టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ మద్యం ద్వారా దోచుకునేందుకు తనకు నచ్చిన బ్రాండ్లను ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాణ్యమైన మద్యం ప్రవేశపెట్టడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేయడం, ఉద్యాన రైతులకు ఎంతో అవసరమైన డ్రిప్ పరికరాలను దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి, ధనుంజయనాయుడు, బీజేపీ పులివెందుల నియోజకవర్గ కన్వీనర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితో ఉద్యాన తోటల పెంపకం

- జిల్లాలో 2700 ఎకరాల్లో సాగు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


టెంకాయ మొక్కలు నాటుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపాధి హామీతో ఉద్యాన తోటల పెంపకం చేపడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం సంబేపల్లె మండలం మోటకట్లకు చెందిన రైతు రాము, వంగిమళ్లవాండ్లపల్లెలో రైతు వంగిమళ్ల సురేశ్‌రెడ్డి పొలంలో డ్వామా పీడీ వెంకటరత్నంతో కలిసి కొబ్బరి మొక్క లు నాటి ఉద్యాన తోటల పెంపకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 2700 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన తోటల పెంపకాన్ని ఉపాధి హామీతో రైతులు చేపడుతున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు మండలాల్లో 1084 ఎకరాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో మామిడి తోటలు అధికంగా ఉన్నాయని, మామిడి కాకుండా సపోటా, దానిమ్మ, టెంకాయ వివిధ రకాల పండ్ల తోటలను పెంచుకోవాలని రైతులకు తెలి పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, ఏపీడీ మధుబాబు, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, ఏపీవో రెడ్డిజవహర్, శివప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శశిధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, దేవపట్ల ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, చంద్రబాబునాయుడు, సుబ్బరాజుయాదవ్, శేఖర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండగంగమ్మ ఆలయానికి రూ.2 లక్షల విరాళం

పెండ్లిమర్రి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నందిమండలం గ్రామ సమీపంలో పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన కొండగంగమ్మతల్లి ఆలయానికి రూ.2లక్షల విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ మారుతీ తెలిపారు. అనంతపురం పట్టణానికి చెందిన యతీష్‌రెడ్డి రూ.51,116 లు, శౌరీన్‌రెడ్డి రూ.51,116లు, పద్మావతి, నరసింహారెడ్డి దంపతులు రూ.1,01,116ల విరాళం అందచేశారన్నారు. ఈ నిధులను సీజీఫ్ మ్యాచింగ్ ఫండ్ ద్వారా ఆలయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ఉపయోగిస్తామని ఈఓ తెలిపారు.

నేడు ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ బాలుర ఎంపికలు

కడప స్పోర్ట్స్, జులై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈనెల 8వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాలుర జిల్లా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డేనియల్ ప్రదీప్ తెలిపారు. క్రీడాకారులు 2012 జనవరి 1 నుంచి 2013 డిసెంబరు 3 మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు.

బ్యానర్ తగిలిస్తూ.. కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు


మృతి చెందిన ఖాజాపీర్

మదనపల్లె అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): బ్యానర్ తగిలిస్తూ కరెంట్ షాక్ గురై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డులోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివ రాల మేరకు... గొల్లపల్లెకు చెందిన ఖాదర్‌బాషాకు మారుడు ఖజాపీర్ (29) బ్యానర్లకు లైటింగ్ వేసే పనిచేసేవాడు. సోమవారం రాత్రి సీటీఎం రోడ్డులోని కరెంటు ఆఫీస్ ఎదురుగా మిద్దెపై బ్యానర్ తగిలిస్తుండగా గాలి ఎక్కువగా రావ డంతో బ్యానర్ కరెంటు తీగలపై పడింది. వెంటనే కరెంటు షాక్‌కు గురై ఖాజా పీర్ అక్కడే మిద్దెపై కుప్పకూలిపోయాడు. స్థానికులు కిందకు దించి వెంటనే ఆటోలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన వ్యక్తిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిం చారని స్థానికులు తెలిపారు. అతని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా టీచర్ ఆత్మహత్యాయత్నం

మైదుకూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వని పెంట బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం జ్యోతి అనే బయా లజీ టీచర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పాఠశాలలో సరిగ్గా బోధన చేయడం లేదంటూ ప్రిన్సి పాల్ నిర్మల వేధింపులకు పాల్పడటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు విలేకరులకు తెలిపారు. ఆమెను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఈ విషయంపై ప్రిన్సిపాల్ నిర్మలను వివరణ కోరగా ఉదయం అసెంబ్లీ జరిగిన తరువాత జ్యోతి మేడం టీచింగ్ డైరీ, లెసన్ ప్లాన్‌పై సంతకం చేయాలని కోరారు. అయితే పని చేయని రోజులలో పనిచేసినట్లు రాసు కొచ్చారు. దీంతో నేను ఎలా సంతకం చేయాలని ప్రశ్నించి.. నేను ఇప్పుడు కొద్దిగా బిజీగా ఉన్నాను. తరువాత చూస్తాను అని చెప్పి పంపానని తెలిపారు. అయితే కొద్ది సేపటికే జ్యోతి మేడం నిద్ర మాత్రలు మింగారని మా స్టాఫ్ చెప్పగా వెళ్లి చూశాను. కానీ నేను మాట్లాడిన కొద్దిసేపటికే నిద్ర మాత్రలు ఆమెకు ఎలా వచ్చాయి.. నిద్రమాత్రలు మింగిన నిమిషాల్లోనే బయట వ్యక్తులు ఎలా పాఠశాలలోకి ఎలా వస్తారని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ప్రీప్లాన్‌గా చేస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే విచారించి ఎవరి తప్పు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

● 'సుపరిపాలనలో తొలి అడుగు'లో టీడీపీ నేతలు



ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరిస్తున్న జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, జూలై 7(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని పాశంవీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంచుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, బంగారు వెంకట్రమణ, గంజిమోహన, గట్టురెడ్డెన్న, సుబ్బారెడ్డి, మస్తాన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నాసిర్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

వాల్మీకిపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతపర్తి గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ మహిత, నాయకులు శేషాద్రిరెడ్డి, గుర్రెడ్డి చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, మద్దెల గిరిబాబు, గంగాధర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తంబళ్లపల్లె, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర అన్నారు. టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డి సూచనల మేరకు సోమవారం మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు మల్లికార్జుననాయుడు, చాంద్‌బాషా, భాస్కర్‌నాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో అనూహ్య స్పందన

కలికిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి కలికిరి మండలంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం మండలంలోని దాదాపు అన్ని పంచాయతీల్లోనూ ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాల కోసం కూడా ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం, జూలై 7(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. టీడీపీ యువనేతలు బీటెక్ సుమన్, యుగంధర్‌రెడ్డి, గంగాధర్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరుస్తామన్నారు. కార్యక్రమంలో మహేశ్వర, రఘునాథరెడ్డి, ఫరూక్, మల్లికార్జున, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన తాగునీటి సమస్య

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గాలివారిపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్య ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చొరవతో పరిష్కారమైంది. గాలివారిపల్లెలో ఉన్న ప్రభుత్వ బోరులో నీరు అడుగంటిపోవడంతో ఆరు నెలలుగా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎంపీటీసీ లక్ష్మి, ఆమె భర్త రెడ్డయ్య నాయుడు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా గ్రామంలో మరో బోరు వేయాలని ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. సోమవారం మధ్యాహ్నం కొత్త బోరుకు మోటారు, స్టార్టరు అమర్చారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచిత గౌరవం దక్కుతుందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర అన్నారు. వరుసగా మూడవసారి పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులైన లక్ష్మీకర్‌ను సోమవారం పీలేరు బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని చెప్పిన ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల కృషితో త్వరలోనే అది కార్యరూపం దాల్చుతుందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పోతంశెట్టి రమేశ్, రామచంద్ర, సత్యనారాయణ, నాగేంద్రప్రసాద్, సురేశ్, మల్లిఖార్జున, చరిత, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

పీలేరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి తెలిపారు. సోమవారం పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ పరిధిలోని జంగంపల్లె వద్ద మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ముందుకు పోతున్నారని, పీలేరును అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు ఎస్.అమరనాథరెడ్డి, వెంకటరెడ్డి, వసంతాల రాజా, నారాయణరెడ్డి, మల్లికార్జున రెడ్డి, యుగంధర్, నందీశ్వర్, శంకర్, జయచంద్ర, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ నుంచి తాగునీరు తీసుకెళ్తున్న గ్రామస్థులు

ఆర్‌వోబీల నిర్మాణాల ఆలస్యంపై ప్రజాగ్రహం

● సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రముఖుల విజ్ఞప్తి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న పీలేరు ప్రజలు

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలోని చిత్తూరు రోడ్డు, ఎల్‌బీఎస్ రోడ్డులోని ఆర్‌వోబీల నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంపై పీలేరు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్‌వోబీల నిర్మాణం జరుగుతున్న చిత్తూరు రోడ్డు, ఎల్‌బీఎస్ రోడ్డు వాసులతో కలిసి పట్టణ ప్రముఖులు తహసీల్దారు శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రవీంద్ర రెడ్డి, విశ్రాంత ఎంఈవో సుగుణాకర్, ప్రముఖ దంత వైద్య నిపుణుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లుగా సాగుతున్న ఆర్‌వోబీల కారణంగా చెలరేగుతున్న దుమ్ము, ధూళి వల్ల తాము తీవ్రమైన శ్వాసకోశ, వెన్నుముక సంబంధ వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. ఆర్‌వోబీలు సకాలంలో పూర్తయితే కోలుకోవచ్చనే ఆశతో నిరీక్షించామని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సబ్-వేలలో తారు రోడ్డు ఏర్పాటు చేయకుండా మట్టి వేసి కాలం గడుపుతున్నారని, వెంటనే తారురోడ్డు ఏర్పాటు చేయడమే కాకుండా మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా కాంట్రాక్టు సంస్థను ఆదేశించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు.

స్పందించిన ఎమ్మెల్యే నల్లారి

ఆర్‌వోబీల నిర్మాణంలో జాప్యంపై పట్టణ ప్రజలు తహసీల్దారుకు వినతిపత్రం అందజేసిన విషయం తెలియగానే ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్పందించారు. వెంటనే ఆయన రెవెన్యూ, ఎన్‌హెచ్, ఆర్ అండ్ బీ, పోలీసు అధికారులతో మాట్లాడారు. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించి తనకు వాస్తవ సమాచారం అందజేయాలని స్థానిక టీడీపీ నాయకులను ఆదేశించారు. దీంతో ఎల్‌బీఎస్ రోడ్డు, చిత్తూరు రోడ్డులో జరుగుతున్న పనులను పరిశీలించి జాప్యానికి గల కారణాలను ఎన్‌హెచ్ ఏఈ మాధవన్‌ను అడిగి తెలుసుకున్నారు. మరో వారం రోజుల్లో తారురోడ్డు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టు సంస్థను ఆదేశించారు.

రేపటి నుంచి నిరవధిక సమ్మె

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పీలేరు గ్రామ పంచాయతీ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం కాలరాసే ప్రయత్నం చేస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి బడా సంస్థలకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమ దోపిడీకి గురయ్యే విధంగా చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీలేరు యూనిట్ అధ్యక్షుడు బీవీ రమణ, సభ్యులు రమణ, వెంకటరమణ, సరోజమ్మ, సుబ్బలక్ష్మి, రాజేశ్వరి, అశోక్, ధనభాగ్య, శాంతకుమారి పాల్గొన్నారు.

కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎంపిక

పీలేరు రూరల్, జూలై 7(ఆంధ్ర జ్యోతి): పీలేరు మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా దొడ్డిపల్లె కార్యదర్శి సిగ్బతుల్లా, ఉపాధ్యక్షుడిగా పీలేరు సచివాలయం-3 కార్యదర్శి ఎల్. జ్ఞానశేఖర్, కార్యదర్శిగా ఎన్.రాధిక, కోశాధికారిగా నందిని, కార్యవర్గ సభ్యులుగా సుబ్రమణ్యం రెడ్డి, జానకిరాం, గుణశేఖర్, హిమబిందు, హసీన, గంగాదేవి, నహీన, భూపతిని ఎన్నుకున్నారు.

ఫార్మసి కళాశాలపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఫీజుల పేరుతో విద్యార్థినిని వేధించి, ఫోటోలు తీయించిన ఫార్మసి కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఈ కళాశాలలో కళాశాల ఫీజు, ల్యాబ్ ఫీజు, రికార్డులు, ఫేర్‌వెల్ ఫంక్షన్ ఫీజుల పేరుతో విద్యార్థులను దోపిడీ చేస్తున్నారని, ఇది ప్రశ్నించిన విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులు తగ్గించి వేధిస్తున్నారని ఆరోపించారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఈ కళాశాలను తనిఖీ చేసి, విద్యార్థులను విచారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఫ్రీద్, జయబాబు, సమీర్, నాని, సుల్తాన్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

1705 బంగారు కుటుంబాల గుర్తింపు

● 15రోజుల్లోగా మ్యాపింగ్ పక్రియను పూర్తి చేయాలి : ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో హరినారాయణ

ములకలచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలో 1705 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీవో హరినారాయణ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 పథకంపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే పీ-4 పథకం సర్వే చేసి బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. బంగారు కుటుంబాలకు సహాయం చేసే మార్గదర్శకులను కలవాలన్నారు. 15 రోజుల్లోగా బంగారు కుటుంబాల వివరాలను మ్యాపింగ్ చేసి వారి అవసరాలను నమోదు చేయాలన్నారు. మండలంలోని బురకాయలకోటలో 83, బురకాయలకోట-2లో 21, చౌడసముద్రంలో 77, గూడుపల్లెలో 81, కదిరినాధునికోటలో 160, కాలవపల్లెలో 121, మద్దినాయనిపల్లెలో 142, మద్దినాయనిపల్లె-2లో 10, ములకలచెరువులో 94, ములకల చెరువు-2లో 78, పెద్దపాళ్యంలో 42, సోంపల్లెలో 200, సోంపల్లె-2లో 287, దేవళచెరువులో 203, వేపూరికోటలో 106 కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. అలాగే 10న జరిగే మెగా పీటీఎంను జయప్రదం చేయాలన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం నేరం : ఎస్ఐ

రామసముద్రం, జూలై 7(ఆంధ్రజ్యోతి): చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అనాలోచిత నిర్ణయాలతో చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని నరసాపురం, ఏతూరుపల్లె గ్రామస్థుల మధ్య ఆదివారం భూవివాదం నెలకొంది. ఇరువురూ ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఓ వర్గానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అదేరోజు సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయలేదని ఆరోపిస్తూ సోమవారం ఉదయం నరసాపురానికి చెందిన బాధిత కుటుంబాల వ్యక్తులు, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఎస్ఐ ఆదివారం సాయంత్రమే నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐఆర్ కాపీని చూపించారు. అయితే ఎఫ్ఐఆర్‌లో నిందితులపై నాన్ బెయిలబుల్ సెక్షన్‌లు లేవని, ఎఫ్ఐఆర్ మార్చాలని డిమాండ్ చేశారు. కేసు తీవ్రతను అనుసరించి, చట్టానికి లోబడి కేసు నమోదు చేశామని, ఎవరి ఇష్ట ప్రకారం వారికి అనుకూలంగా కేసులు సెక్షన్లు మార్చడం కుదరదని ఎస్ఐ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా గత నెలలో ఇదే సామాజిక వర్గానికి చెందిన వందలాది మంది ఓ కేసు విషయమై పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి స్టేషన్ ముందు ధర్నా చేయగా ప్రత్యేక పోలీస్ బలగాలతో పికెటింగ్ నిర్వహించారు.

రసాభాసగా టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు

● ఆరుచోట్ల వాయిదా.. ఎలక్షన్‌కు కార్యకర్తల డిమాండ్

నిమ్మనపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పార్టీ ఆవిర్భావం నుండి టీడీపీలో కొనసాగుతూ కనీసం గ్రామకమిటీ కూడా అవకాశం కల్పించకపోవడం దారణమని పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం టీడీపీ సంస్థాగత ఎన్నికను నిమ్మనపల్లి మండల అబ్జర్వర్ కుడుము శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రాచవేటివారిపల్లిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా మల్లికార్జున నాయుడును, అలాగే వెంగంవారిపల్లి పంచాయతీలో భారతం నారాయణను, అగ్రహారం పంచాయతీలో శ్రీనివాసులును, బండ్లపై పంచాయతీ గ్రామ అధ్యక్షుడు రమణను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. రెడ్డివారిపల్లిలో జరిగిన గ్రామ కమిటీ సమావేశంలో నాయకుల మధ్య సయోధ్య కుదరక వాయిదా పడింది. అలాగే మూష్టూరులో జరిగిన కమిటీ సమావేశంలో నాయకుల మధ్య వాగ్వాదంతో, కొండయ్యగారిపల్లిలో నలుగురు అధ్యక్ష పదవికి పోటీపడగా అక్కడి నాయకుల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. అనంతరం నిమ్మనపల్లి, తవళం పంచాయతీలో నాయకుల మధ్య సయోధ్య కుదరక వాయిదా పడింది. అయితే సామకోటవారిపల్లి పర్యటన నిలిచిపోయింది. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, మునిరత్నం, సుధాకర్‌రావు, శ్రీనివాసులు, రాజన్న, సుధాక ర్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్దమండ్యం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుడుమలవారిపల్లి సమీపంలో ఉన్న రోడ్డు మలుపులో బొలెరో లగేజీ వాహనం, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిన్నమండ్యంకు చెందిన వెంకటసుబ్బారెడ్డి తన భార్య స్రవంతితో కలిసి ద్విచక్ర వాహనంలో పెద్దమడ్యం మండలం గుడిసెవారిపల్లిలో వుండే బంధువుల ఇంటికి బయలుదేరారు. పెద్దమండ్యం మండలానికి చెందిన డ్రైవర్ బొలెరో లగేజీ వాహనంతో చిన్నమండ్యంకు బయలు దేరాడు. మార్గమధ్యంలో కుడుమలవారిపల్లి సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటసుబ్బారెడ్డి (40) తలకు తీవ్ర గాయం కాగా 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం వేలూరుకు తరలించారు. స్రవంతికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బుద్ధుని విగ్రహం ధ్వంసం చేసినవారిని కఠినంగా శిక్షించాలి



సమావేశంలో ఐక్యత చాటుతున్న ప్రజా, కుల సంఘాల నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని అంకిశెట్టిపల్లెలో ఉన్న బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని కఠినంగా శిక్షించాలని ప్రజా, కుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో కులసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ మదనపల్లెలో పోలీసులు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మదనపల్లె ఘటనపై బాస్ నేతలు కాలనీగేటులో అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేస్తుండగా అనుమతులు లేవని అరెస్టు చేశారన్నారు. బాస్‌నేతలపై ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. మాలమహానాడు జాతీయ నేత యమలా సుదర్శనం మాట్లాడుతూ దళితులపై ఏ ప్రభుత్వంలోనైనా దాడులు, దౌర్జన్యాలు, మానభంగాలు, కేసుల తప్పడం లేదన్నారు. బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ అసలు దుండగులను వదిలేసి న్యాయ పోరాటం చేస్తున్నవారిపై పోలీసులు కేసులు పెట్టాడం సరికాదన్నారు. చేనేత కార్మిక సంఘం నాయకుడు మోడెం నాగరాజ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు సంబంధం లేకుండా, ఎవ్వరికీ ఇబ్బందులు కలగకుండా శాంతియుతంగా నిరసన చేస్తున్నవారిపై కేసు ఎలా పెడతారని పోలీసులను ప్రశ్నించారు. బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనపై నివారించడానికి బీఎస్పీ మద్దతు ఉంటుందన్నారు. సీపీఐ నాయకుడు ప్రభాకర్ మాట్లాడుతూ పోలీసులు అత్యుత్సహంతోనే బాస్ నాయకులపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

ములకలచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): బాస్ వ్యవస్థాపకుడు శివప్రసాద్‌ను నిర్బంధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బాస్ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ప్రదీప్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాట్ల నరసింహులు, మంత్రాల రమణ, రెడ్డెప్ప మాట్లాడుతూ మదనపల్లె మండలంలో ఉన్న బుద్ధుని తల నరికిన ఉన్మాద ఘటనపై విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న శివప్రసాద్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళి నిర్బంధించడం హక్కులను హరించడమేనన్నారు. కార్యక్రమంలో డేగాని హరి, నరసింహులు, మధు, పెద్దరెడ్డెప్ప, విశ్వనాధ, శంకర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తంబళ్లపల్లె, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం తంబళ్లపల్లెలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక హరిత కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ ఆత్మ గౌవర జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా భారీ కేకు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జల్లా ఇంచార్జి డానియల్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, ఇంచార్జి వేటా మల్లికార్జున, మండల అధ్యక్షుడు గంగాధర, మల్లికార్జున, టీడీపీ నాయకులు పురుషోత్తం, వీరాంజినేయులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం కేవీపల్లె మండలం గర్నిమిట్టలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల కన్వీనర్ శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ ముల్లంగి చంద్రయ్య ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. మాదిగల సమస్యల పరిష్కారానికి ఎమ్మార్పీఎస్ అవిశ్రాంత పోరాటం చేస్తోందని, భవిష్యత్తులోనూ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరయ్య, అశోక్, సామ్రాట్ శేషాద్రి, అమృతపురి మల్లిఖార్జున, బాబు, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో..

నిమ్మనపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక పెద్దమాదిగపల్లిలో సోమవారం ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవం, మంద క్రిష్ణమాదిగ జన్మదిన వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జండాను ఆవిష్కరించి కేకు కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మంద క్రిష్ణమాదిగ అహర్నిషలు శ్రమించి సాధించారని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, నారాయణ, రమణ, కదిరప్ప, మురళి, రామయ్య తదితరలు పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు సర్కిల్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, ఎంఎస్పీ ఇన్‌చార్జి తిరుపాల్, గౌరవాధ్యక్షుడు తుడుము శ్రీరాములు, మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు బయన్న, తోపు రమణ, రామకృష్ణ, రామనాథ్, నారాయణ, సోమశేఖర్, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలోని బస్టాండు కూడలిలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలతో కలసి మండల అధ్యక్షుడు ముబ్బు రామచంద్ర, మాజీ మండల అధ్యక్షుడు పెద్దోడు, చంద్ర, జిల్లా నాయకుడు వెంకటప్ప అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్ మాదిగ, ఎంఎస్పీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపాల్ మాదిగ మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం వల్ల సాధించుకున్న ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉప కులాలకు విద్య, ఉద్యోగ, రాజకీయంగా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి గంగాద్రి, కార్యదర్శి నరసింహులు, నాయకులు మునిరాజ, సాగర్, వెంకట్రమణ, బొజ్జప్ప, వెంకటేష్, రమణ, తుడుము శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో...

పెద్దమండ్యం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం సందర్భంగా సోమవారం జండాను ఆవిష్కరించారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర ఎస్సీ వరీకరణకు మందకృష్ణమాదిగ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ దానియల్ మాదిగ, మహిళా అధ్యక్షురాలు జయమ్మ, ఉపాధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు వెంకటప్ప మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

బి.కొత్తకోట, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీయస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ పుట్టినరోజుతో పాటు, ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని బి.కొత్తకోటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ ఉన్నతాశయంతో మాదిగ రిజర్వేషన్ పోరాటసమితిని స్థాపించి, అలుపెరగని పోరాటానికి నేతృత్వం వహించి లక్ష్యాన్ని సాధించిన గొప్ప వ్యక్తి మందక్రిష్ణ మాదిగ అని కొనియాడారు. కార్యక్రమంలో భవానివెంకటేష్, సురేంద్ర, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బస్టాండు కూడలిలో జండాను ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రమణ, శ్రీనాథ్, గంగాధర్, రెడ్డెయ్య, బాలాజి పాల్గొన్నారు.



కలకడలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంచి జీవనశైలితోనే ఉన్నత లక్ష్యాల సాధన

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మంచి జీవనశైలితోనే ఉన్నత లక్ష్యాలను సాధించగలరని తలపుల పీహెచ్‌సీ వైద్యులు గిరిషా, చంద్రశేఖర్ నాయక్ విద్యార్థులకు సూచించారు. పీలేరులోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం 'మంచి జీవనశైలి-మనకెంతో మేలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఒత్తిడి, ఆందోళనకు గురైతే చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని, సందేహాలను ఉపాధ్యాయులను అడిగి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకేశ్వరి, హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎం కృష్ణమ్మ, సీహెచ్‌వో లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.